నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
1
గురువారం | ఏప్రిల్ 4, 2024 | www.navatelangana.com

అనుమతులు లేని వాటర్‌ప్లాంట్‌లపై జీడబ్ల్యుఎంసీ అధికారుల కొరడా

- నాలుగు ప్లాంట్‌లకు రూ.80 వేల జరిమానా



నవతెలంగాణ-వరంగల్

నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా నగరంలో నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్లపై బల్దియా శానిటేషన్ అధికారులు కొరడా ఝులిపించారు. బుధవారం బల్దియా పరిధి లోని సుమారు 50 వాటర్ ప్లాంట్‌లలో ముఖ్య ఆరోగ్యాధికారి డాక్టర్ రాజేష్ నేతృత్వంలో తనిఖీలు నిర్వహించి నీటి స్వచ్ఛత ప్రమాణాలు పాటించని ప్లాంట్‌లు, అనుమతులు లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న, ల్యాబ్ నివేదికలను సక్రమంగా నిర్వహించనందుకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా నగర పరిధి లోని గోకుల్‌నగర్, ఇందిరానగర్, గోపాల్‌పూర్ ప్రాంతాల్లోని 4 వాటర్‌ప్లాంట్‌లను సందర్శించిన నేపథ్యంలో నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్‌లకు కమీషనర్ ఆదేశాల మేరకు రూ.80 వేల జరిమానా విధించి నోటీసులు జారీ చేయడం జరిగిందని, నోటీసులు స్వీకరించిన వాటర్ ప్లాంట్ నిర్వాహకులు 7 రోజుల్లో అనుమతులు పొందాల్సి ఉంటుందని, అనుమతులు పొందని వాటర్ ప్లాంట్‌లపై చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టడంతో పాటు అట్టి ప్లాంట్‌లను మూసి వేయడం జరుగుతుందని సిఎంహెచ్ఓ తెలిపారు.

ఈ కార్యక్రమంలో జీడబ్ల్యుఎంసీ సానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు అనిల్, గోల్కొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ప్రగతిపథంలో వరంగల్

- దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ



నవతెలంగాణ-వరంగల్

కాంగ్రెస్ ప్రజాప్రభుత్వ పాలనలో వరంగల్ ను ప్రగతి పథంలో నడిపిస్తామని అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండాసురేఖ అన్నారు. వరంగల్ మహానగరపాలక సంస్థ పరిధి 32 33 కరీమాబాదులో బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమానికి మంత్రి సురేఖ హాజరై మాట్లాడుతూ అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే ఐదు గ్యారంటీలను అమలు చేసి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేతల ప్రభుత్వంగా నిరూపించుకుందని మంత్రి స్పష్టం చేశారు. కరీమాబాద్‌లోని 32,33 డివిజన్ల పరిధిలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవానికి మంత్రి సురేఖ హాజరై అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆ ప్రాంత ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన స్వల్పకాలంలోనే ఐదు గ్యారంటీలను అమలు చేసి ప్రజా సంక్షేమం పట్ల నిబద్ధతను చాటుకున్న దని అన్నారు. తొమ్మిదిన్నరేండ్ల పాలనలో ప్రజలకు ఉపయోగపడే ఏ పనీ చేయని బీఆర్ఎస్ ప్రభుత్వం పథకాల అమలు ఏమైందంటూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ జనంలో మరింత దిగజారిపోతున్నదని మంత్రి విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి కాంగ్రెస్‌పార్టీని విమర్శించే అర్హత ఏమాత్రం లేదని తేల్చి చెప్పారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో తెలంగాణ ఉజ్వలంగా ఎదుగుతుందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

తేమలేని ధాన్యాన్ని తీసుకురావాలి : ఏపీఎం

నవతెలంగాణ-చెన్నారావుపేట



రైతులు నాణ్యత పాటించాలని ఏపీఎం ఈశ్వరయ్య అన్నారు. మండలంలోని కోనాపురం గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో బుధవారం వారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిపంట పండించిన రైతులు పంటను వరి కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. రైతులు నాణ్యతాప్రమాణాలు పాటించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు పొందాలన్నారు. రైతు పట్టాపాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకుఖాతా జిరాక్స్ ప్రతులను రెండుసెట్లు తీసుకురావాలన్నారు. రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దని కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వమే గిట్టుబాటు ధరతో గ్రేడ్ ఎ రూ.2203లు, రూ. గ్రేడ్ సాధారణ రకం రూ.2183లుతో ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, సీసీలు శ్రీలత, కట్టయ్య, ఎర్ర మమత, మండల రమేష్, అనిత, స్పెషల్ ఆఫీసర్ రజిత, కమిటీ సభ్యులు సుజాత ,హైమా, రజిత, లలిత, పద్మ, రైతులు పాల్గొన్నారు.

ఆర్డీఎఫ్ పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం

నవతెలంగాణ-నెక్కొండ



మండలంలోని రెడ్లవాడ ఆర్డీఎఫ్ పాఠశాలలో బుధవారం 18వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై మహేందర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. ఎస్సై మహేందర్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చేరాలు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటా : ఎర్రబెల్లి



నవతెలంగాణ-పర్వతగిరి

కార్యకర్తలు అధైర్య పడొద్దు అండగా నేనుంటా అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. పర్వతగిరి మండలం లోని తురుకల సోమారంలో ఆయనతో సొసైటీ చైర్మన్ మోటపోతుల మనోజ్ కుమార్ లు బుధవారం స్థానిక కార్యకర్తలను కలిశారు.ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ కార్యకర్తలు అధైర్య పడవద్దు నేను మీకు ఉన్నాను మిమ్ములను కంటికి రెప్పలా చూసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు బూర శ్యామ్, జంగిలి యాకయ్య, వల్లకొండ ఎల్లగౌడ్, ఎస్కే. ఖలీల్, రాపాక శేఖర్, కొలిపాక మధు తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

మండలంలోని పెద్దతండా గ్రామ పార్టీ అధ్యక్షుడు మంజీనాయక్ కూతురు వివాహంలో పాల్గొని వధూవరులను బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆశీర్వదించారు. అనంతరం వధూవరులు మహేశ్వరి, దేవేందర్‌లకు నూతన వస్త్రాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మేడిశెట్టి రాములు, పర్వతగిరి సొసైటీ చైర్మన్ మనోజ్ కుమార్, ఎంపీపీ కమలపంతులు, జిల్లాకోఆప్షన్‌సభ్యులు మహమ్మద్ సర్వర్, నాయకులు యాకయ్య,బాలు,బాబు, తండా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సురేఖను కలిసిన మోహన్ గౌడ్

నవతెలంగాణ-హన్మకొండ



రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండ సురేఖను బుధవారం రాంనగర్ లో వరంగల్ జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు నకిరేకంటి మోహన్‌గౌడ్ మర్యాదపూర్వంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సురేఖ మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య గెలుపు కోసం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్ధన్, స్వప్న, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ, ఎంపీటీసీ పద్మశంకర్ రెడ్డి, మోహన్‌రామ్‌సింగ్, పాషా పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సరఫరాకు పటిష్టచర్యలు : కలెక్టర్ ప్రావీణ్య



నవతెలంగాణ-వరంగల్

జిల్లాలో వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా సమృద్ధిగా నీటిసరఫరా జరిగేలా ప్రణాళిక బద్ధం గా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారంఅదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలసి మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓ, ఎంపివోలు, ఇంజనీరింగ్, సంబంధితశాఖల అధికారులతో నీటి సరఫరాపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పక్కా ప్రణాళికతో నీటి ఇబ్బందులను అధిగమించాలని సూచించారు. మిషన్‌భగీరథతో పాటు ప్రత్యామ్నాయ నీటివనరులను సిద్ధం చేయాలని, వాటికి అవసరమైన మరమ్మతులు చేయాలని కలెక్టర్ సూచించారు. స్థానికంగా ఉన్న నీటివనరులు, బోరు బావులను తక్షణమే మరమ్మతులు చేయించాలన్నారు.

జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట మునిసిపాలిటీలు, మండలాల వారీగా తాగునీటి సరఫరా ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లోనూ చివరి నివాస ప్రాంతం వరకు నీరు చేరేలా చూడాలన్నారు. జిల్లాలో తాగునీటి సరఫరా పర్యవేక్షణ నిమిత్తం ప్రభుత్వం రాష్ట్ర వ్యవసాయశాఖ సంచాలకులు బి.గోపిని నియమించినట్లు తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీవోలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో ప్రతిరోజు పర్యటించి సమస్యలను గుర్తించిఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. నీటి ఇబ్బందులు రాకుండా పక్కా ప్రణాళికతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమీక్ష లో జెడ్పీ సీఈవో రాంరెడ్డి, డీపీవో కల్పన, డీఆర్డీఓ కౌసల్య దేవి తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో సందేహాల నివృత్తికి ప్రత్యేక మొబైల్ నంబర్

నీటి సరఫరా జరిగే క్రమంలో ఏర్పడే సందేహాల నివృత్తికి ప్రత్యేక మొబైల్ నెంబర్ 7207908583 ను ఏర్పాటు చేసినట్లు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 66 డివిజన్ల వ్యాప్తంగా ఉద యం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు నీటి సరఫరా జరిగే సమయాల్లో ఇబ్బందులు ఏర్పడితే సూచించిన నెంబర్‌కు సమాచారం అందిస్తే అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరి ష్కరిస్తారని, బల్దియా టోల్‌ఫ్రీ నెంబర్ లో సంప్ర దించి కూడా సమస్యను పరిష్కరించు కోవచ్చని ఈ సందర్భంగా కమిషనర్ తెలిపారు.

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలి

- సీపీఐ (ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి



నవతెలంగాణ-నర్సంపేట

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని చిత్తుగా ఓడించాలని సీపీఐ (ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని కాకతీయ నగర్‌లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టిన భూపోరాటం మూడేండ్లు పూర్తి చేసుకోగా వార్షికోత్సవ సభ నిర్వహించారు. సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్‌అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా కృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 10 యేండ్లు పూర్తయినా అట్టడుగులోని వ్యవసాయ కార్మికులు, దళితులు, పేదలు కార్మికుల జీవన స్థితిగతులు ఏమాత్రం మారలేదన్నారు. నిరుద్యోగం, విద్య, వైద్యం వంటి అనేక సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ చూపక పోగా దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టిందని విమర్శించారు. ప్రజలు నిర్మించుకున్న ఎల్ఐసీ, బ్యాంకింగ్, బీఎస్ఎన్ఎల్, విమానయానం, రైల్వే, బొగ్గు ఉత్పత్తి చేసే సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పనంగా అప్పగించడం కోసం పూనుకుందన్నారు. ఇందులో భాగమే ప్రభుత్వరంగ సంస్థలను మొత్తంగా కారుచౌకగా ఆధాని కంపెనీకి అప్పజెప్తోందని తెలిపారు. మరో వైపు దేశంలో మతాన్ని కేంద్రంగా చేసుకొని విద్వేషాలను రగిలిస్తూ పాలన కొనసాగిస్తుందన్నారు. మతకలహాలను సష్టిస్తుందని, ఇటీవల మణిపూర్ ఘటనే ఇందుకు నిదర్శనమన్నారు.

తిరిగి బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వస్తే దేశంలోని అన్నిరాష్ట్రాల్లో మతకలహాలు సృష్టించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు వ్యతిరేక చట్టాలను తీసుకరాగా రైతులు ముక్తకంఠంతో వ్యతిరేకించారని గుర్తుచేశారు. యేడాదిపాటు సాగిన ఈ పోరాటంలో 700 మంది అమాయక రైతులను బలితీసుకొందని దుయ్యబట్టారు. ఆ తర్వాతే రైతు పోరాటాలకు తలొగ్గి నల్ల చట్టాలను రద్దు చేసిందన్నారు. బీజేపీ ఆ విధానాలను మాత్రం వీడకపోగా ఇంకా ప్రమాదం పొంచి ఉందన్నారు. విద్య వైద్యానికి నిధుల కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తుందని, ఉన్నత విద్యను అభ్యసించిన వెనకబడిన తరగతికి చెందిన యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ వచ్చిందని తెలిపారు. అందుకే దేశంలో ఇంకా నిరుద్యోగ సమస్య విలయతాండం చేస్తుందన్నారు. ఈ సమస్యలన్నింటిని పరిష్కరించాల్సిన బీజేపీ ప్రభుత్వం ఈ బాధ్యతల నుంచి తప్పుకుంటుందన్నారు. మౌలిక సమస్యలను ప్రజలు మరిచిపోవడానికి వారి ఆలోచనల మీద మత భావాలను బలవంతంగా చొప్పిస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రజా తంత్రవాదులు, సమస్త ప్రజానీకానికి సంబంధించిన అనేక సమస్యలను ప్రస్తావించగలిగే కమ్యూనిస్టులు చట్టసభల్లో లేకపోవడం వల్లనే ప్రజలకు నష్టవాటిల్లుతుందన్నారు. అందుకే కమ్యూనిస్టు, బలపర్చిన అ భ్యర్థులకు మద్దనిచ్చి బీజేపీని ఓడిస్తేనే ఈ దేశాన్ని కాపాడుకోగలుగుతామని పేర్కొన్నారు.

గుడిసెవాసులకు పట్టాలిచ్చి ఇండ్లు నిర్మించాలి : చింతమల్ల రంగయ్య

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య మాట్లాడుతూ పట్టణంలో పేదలు గుడిసెలు వేసుకొని మూడు సంవత్సరాలు పూర్తియిందన్నారు. ఈ మూడేండ్లలో భూకబ్జాదారులు దాడులు, దౌర్జన్యాలు చేసి గుడిసెలు దగ్ధం చేసి భయభ్రాంతులకు గురిచేసిన చెక్కుచెదరకుండా నిలబడి గుడిసెలను తిరిగి నిర్మాణం చేసుకొని ఎదురొడ్డారన్నారు. కిందటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఒక్క పేదోడికి ఇండ్ల స్థలాలు ఇచ్చిన దాఖాలాలు లేవన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే గుడిసెవాసులకు కనీస సౌకర్యాలు కల్పించారని తెలిపారు. రాబోయే కాలంలో పేదల గుడిసెలకు పట్టాలు ఇప్పించి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈసంపెల్లి బాబు, కొరబోయిన కుమారస్వామి, ములుగు జిల్లా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బీరెడ్డి సాంబశివ, సీపీఐ(ఎం) పట్టణ నాయకులు, కందికొండ రాజు, మండల అశోక్, నాయకులు జగన్నాథం, కార్తీక్, కలకోట అనిల్, ఎండీ ఫరిదా, వజ్జంతి విజయ, బిట్ర స్వప్న, ఉదయగిరి నాగమణి, ఇంద్ర, విలియం కేరి, లక్ష్మీ, యాకలక్ష్మీ, ఐటిపాముల వెంకన్న, కొండి మల్లయ్య, తోటకూరి రజిత, మల్లేష్, మహేష్, రజిత, రాణి, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలి : సీఎండీ



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

వేసవిలో విద్యుత్ సరఫరాలో వినియోగదారులకు ఏమాత్రం ఇబ్బందులు లేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరిస్తూ పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ భవన్ కార్పొరేట్ కార్యాలయంలో నక్కలగుట్ట లోని 16 జిల్లాల సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్లు, ఎస్ఏఓలు, డివిజినల్ ఇంజనీర్లతో సీఎండీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడుతూ 132 కెవిసబ్ స్టేషన్ ల పనులను పూర్తి చేయాలనీ ఆదేశించారు. 33/11 కెవి ట్రిప్పింగ్స్, బ్రేక్‌డౌన్స్, అంతరాయాలను గత ఏడాది కంటే ఈ ఏడాది లో తగ్గించినందుకు అభినందించారు. ఇదే విధంగా కొనసాగించాలని కోరారు. ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు చెందకుండా ఉండటానికి సరైన ఎర్తింగ్, ఓవర్‌లోడ్ కాకుండా నిర్వహణ, రిలే సెట్టింగ్, ఏబీస్విచ్స్, వీసీబీలను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేసుకోవాలని కోరారు.

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా సత్వర చర్యలు చేపట్టాలని, ప్రమాదాల నివారణకు వీడియో ను రూపొందించామని జీరో ప్రమాదాల సర్కిల్ కు అవార్డు ప్రకటిస్తామన్నారు. వేసవి కాలానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని కోరారు. విద్యుత్ బిల్లుల చెల్లింపు ఆన్లైన్ ద్వారా చేపట్టేటట్లు వినియోగదారులకు మరింత విస్తత ప్రచారం చేయాలనీ తెలిపారు. బిల్లింగ్ ప్రక్రియ ప్రతీనెలా 14 వరకు పూర్తి చేయాలనీ ఆదేశించారు. రెండు సంవత్సరాల పై బడిన వర్క్ ఆర్డర్స్ ను ముగించాలన్నారు. కెపాసిటర్ బ్యాంకులను అవసరం ఉన్న చోట పెట్టాలన్నారు.

వ్యవసాయ సర్వీసులను పెండింగ్ లేకుండా వెంటనే రిలీజ్ చేయాలన్నారు. వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి నిబ్బద్ధతతో, ఆహర్నిశలు పని చేసి వినియోగదారులమన్నన చూరగొనాలన్నారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి డైరెక్టర్ లు అశోక్ కుమార్, సదర్‌లాల్, మోహన్ రావు, తిరుపతిరెడ్డి, సీజీయం లు టి.మధుసూదన్, సి.ప్రభాకర్, రాజుచౌహన్, కిషన్, అశోక్, రవీంద్రనాథ్, కె.ఎస్ గుట్ట తదితరులు పాల్గొన్నారు.

టేకులకుంటతండాలో కానరాని ఎన్నికల ప్రవర్తన నియామావళి





వాల్ రైటింగ్స్‌పై దృష్టిపెట్టని పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేక అధికారులు

నవతెలంగాణ-నెక్కొండ

పార్లమెంట్ ఎన్నికల కోడ్ కూసిన వెంటనే గ్రామాల్లో రాజకీయరాతలు, వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలను తొలగింపు కార్యక్రమం చేపట్టారు అధికార యంత్రాంగం. కానీ నెక్కొండ మండలంలోని గ్రామాల్లో ఎన్నికలకోడ్ అమల్లోకి వచ్చిన మూడువారాలు గడుస్తున్నప్పటికి కొందరు అధికారుల్లో మాత్రం పట్టింపు కరువైందనే చెప్పుకోవచ్చు. అధికారుల నిర్లక్ష్యానికి గోడలపై, గ్రామంలోని కల్వర్టులపై వాల్ రైటింగ్ నిదర్శనంగా నిలుస్తున్నాయి. గ్రామంలోని పంచాయతీ కార్యదర్శి మొదలుకుని గ్రామ ప్రత్యేకాధికారి, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీం సభ్యులు, సీ-విజిల్ మొబైల్ టీం అధికారులు సైతం ఆ వాల్‌రైటింగ్స్ దృష్టిసారించకపోవడం గమనార్హం. నెక్కొండ మండలం టేకులకుంటతండాలో గోడలు, కల్వర్టులపై రాతలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. మొబైల్ టీం సభ్యులు సైతం ఆయా గ్రామాల్లో పర్యటిస్తున్నారే తప్పా అట్టి పరిసరాలను పరిశీలించకుండానే పర్యటనలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. వాల్ రైటింగ్స్‌పై బహిరంగంగానే ప్రభుత్వ పాఠశాల, టేకులకుంటతండా ప్రధాన రహదారిపై ఉన్నప్పటికి అధికారులకు మాత్రం ఆ రైటింగ్స్ కానరాకపోవడం విడ్డూరంగానే ఉందని అధికారులు భావిస్తున్నారు. మండల అధికారులు సైతం ఆ గ్రామ పంచాయతీతోపాటు మరో గ్రామపంచాయతీపై దృష్టిసారించక పోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఇప్పటికైనా అధికారులు మేల్కొంటారా లేకపోతే ఎన్నికలు ముగిసాకనే అధికారులు గుర్తిసారనేది ప్రశ్నార్థకంగా మారింది. అధికార యంత్రాంగం పనితీరు ఈ వాల్ రైటింగ్స్‌పై దృష్టిసారించినట్లుగా కానరాడంలేదు.

ఎన్నికల కోడ్‌లోనే పనిచేయన అధికారులు ఎన్నికల్లో ప్రభావం ఎలా ఉంటుందని పలువురు బహిరంగాగానే విమర్శిస్తున్నారు.

మనస్థాపంతో నిరుద్యోగి ఆత్మహత్య

నవతెలంగాణ-కాశిబుగ్గ



ఉన్నత చదువులు చదివిఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలనే కోరికతో అప్పులు చేసి కోచింగ్ తీసుకొని పరీక్షలు రాసిన ఓ నిరుద్యోగి ఉద్యోగం దక్కకపోవడంతో చివరకు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం గ్రేటర్ వరంగల్ పరిధిలోని 14వ డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, ఏనమాముల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం14వ డివిజన్ ఎన్టీఆర్ నగర్‌కు చెందిన సారేకొక్కు అశోక్ (32) పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్నాడు. ఈక్రమంలో సివిల్ విభాగంలో డ్రైవర్ పోస్ట్ కోసం దరఖాస్తు చేసి కోచింగ్ తీసుకుని ఎగ్జామ్ రాసాడు ఈ క్రమంలో. ఇటీవల వెలువడిన ఫలితాల్లో స్వల్పతేడాతో ఉద్యోగం కోల్పోయిన అశోక్ బుధవారం ఉదయం ఇంట్లోఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే అశోక్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా అందరితో కలివిడిగా ఉండే అశోక్ మరణంతో ఎన్టీఆర్ నగర్ ప్రజలు కన్నీరు మున్నీరుగా విలపించారు. కాగా ప్రేమ వివాహం చేసుకున్న అశోక్ తన కోచింగ్ కోసం, కుటుంబ పోషణకు చేసిన అప్పులు పెరగడంతో మరణించారని, ఆయన మర ణంతో ఆయన భార్య ప్రియాంక, కూతురు, కుమారుడు రోడ్డున పడ్డారని, ప్రభుత్వం స్పందించి ఆయన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

మలేరియా సిబ్బందికి వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కోశాధికారి సింగారపు బాబు



నవతెలంగాణ-వరంగల్

మలేరియా సిబ్బందికి వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి సింగారపు బాబు అన్నారు. వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం కమిషనర్ ఛాంబర్ లో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకాడేను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ బల్దియా కార్యాలయంలో 90 మంది మలేరియా సిబ్బంది 12 ఏళ్ల నుండి విధులు నిర్వర్తిస్తున్నారు. జనవరి నుండి మార్చి నెలల వేతనాలు ఇప్పటి వరకు రాకపోవడంతో మలేరియా కార్మికులు బతకడం దినదినం ప్రాణ గండం అవుతుందన్నారు. ఇల్లు గడవకపో యేసరికి ఆర్థిక భారం పడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రతాప్, మొగిలి, రమేష్ పాల్గొన్నారు.

నేడు సాయిబాబా సత్సంగ్ మందిర్‌కు భూమి పూజ

నవతెలంగాణ-శాయంపేట

మండల కేంద్రంలోని గాంధీ చౌక్ సర్కిల్లో శ్రీ షిరిడి సాయిబాబా సత్సంగ మందిర్ నిర్మాణానికి గురువారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్, మాజీ సర్పంచ్ కందగట్ల రవి బుధవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య, ఎంపీ దయాకర్, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్రజ్యోతి హాజరుకానున్నట్లు తెలిపా రు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హనుమకొండ
2
గురువారం | ఏప్రిల్ 4, 2024 | www.navatelangana.com

ఈనెల 6 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటు జాబితాను అందజేయాలి



జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికగుప్తా

నవతెలంగాణ-సుబేదారి

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అత్యవసర సేవల విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందిఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు వారి జాబితాను నోడల్ అధికారుల ద్వారా ఈనెల 6వ తేదీ వరకు కలెక్టరేట్ కార్యాలయంలో సమర్పించాలని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికగుప్తా అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అత్యవసర సేవల విభాగంలో పనిచేసేవారికి పోస్టల్ బ్యాలెట్ అంశం గురించి వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ రాధికగుప్తా మాట్లాడుతూ అత్యవసర సేవల విభాగాల్లో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకునేలా ఆయా శాఖల అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ఈనెల 6వ తేదీ వరకు అందే దరఖాస్తులను ఆన్‌లైన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ, ఎన్పీడీసీఎల్, వైద్య ఆరోగ్యశాఖ, సివిల్ సప్లై, బీఎస్ఎన్ఎల్, అగ్నిమాపక, సమాచార పౌర సంబంధాలశాఖ, దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో, ఎఫ్‌సిఐ, రైల్వే శాఖల ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో వైవి.గణేష్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ ఆఫీసర్ సురేష్ బాబు, ఆర్టీసీ డిఎం ధరంసింగ్, ఎంవీఐ రమేష్ రాథోడ్, అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ మదన్ మోహన్ రావు, కలెక్టరేట్ ఏవో సత్యనారాయణ, పోలీస్ ఇన్స్పెక్టర్ సీతారెడ్డి, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంలు, వీవీప్యాట్ల మొదటిదశ ర్యాండమైజేషన్ ప్రక్రియపూర్తి



- **హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

నవతెలంగాణ-సుబేదారి

లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులసమక్షంలో ఈవీఎంలు, వీవీప్యాట్ల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లు హనుమకొండ జిల్లాకలెక్టర్ సిక్తాపట్నాయక్అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మొదటిదశ ర్యాండమైజేషన్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాండమైజేషన్ ప్రక్రియకు సంబంధించిన రికార్డులను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ర్యాండమైజేషన్లో భాగంగా జిల్లాలోని పరకాల నియోజకవర్గానికి సంబంధించి 239 పోలింగ్ కేంద్రాలకు గాను 298 బ్యాలెట్ యూనిట్లు, 298 కంట్రోల్ యూనిట్లు, 334 వివిప్యాట్లు, అదేవిధంగా పశ్చిమని యోజకవర్గానికి సంబంధించి 244 పోలింగ్ కేంద్రాలకుగాను 305 బ్యాలెట్ యూనిట్లు, 305 కంట్రోల్ యూనిట్లు, 341 వివిప్యాట్లను కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. సువిధయాప్, పోస్టల్ బ్యాలెట్,తదితర ఎన్నికలకు సంబంధించిన అంశాలను గురించి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ రాజకీయపార్టీల ప్రతినిధులకు చర్చించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు రాధికగుప్తా, వెంకట్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, డీఆర్వో వైవీ.గణేష్, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డాక్టర్ కె. నారాయణ, హనుమకొండ తహశీల్దార్ విజయ్‌కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రసాదరావు, కలెక్టరేట్ ఏవో సత్యనారాయణ, నాయబ్ తహసీల్దార్ జె. శ్యామ్ కుమార్, పార్టీల ప్రతినిధులు ఇవి.శ్రీనివాస్‌రావు,రజినీకాంత్, మణి,శ్యామ్,నేహాల్, సయ్యద్ ఫైజుల్లా, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు



నవతెలంగాణ-ఎల్కతుర్తి

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ఏవో రాజ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని గోపాల్‌పూర్ ఎల్కతుర్తి, కేశవాపూర్, దామెర గ్రామాల్లో సొసైటీ, ఐకెపి కేంద్రాల ద్వారా ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రా లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రభు త్వ కొనుగోలు కేంద్రాలలో ఏ గ్రేడ్ వరి ధాన్యానికి రూ.2240, క్వింటాలుకు, బి గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2210లు చెల్లిస్తున్నామన్నారు. రైతులు ధాన్యం అమ్మిన వారం రోజుల్లోగా డబ్బులునేరుగా రైతు ఖాతాలోని జమ చేయబడతాయన్నారు. ఆయన వెంట సొసైటీ సీఈఓ తిరుపతి, ఏఈఓ కళ్యాణి, డిసిఐఓ సీనియర్ ఇన్స్పెక్టర్ మనోహర్, రైతులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య 97వ జయంతి



నవతెలంగాణ-నయీంనగర్

అన్యాయంపై గళం ఎత్తిన వ్యక్తి దొడ్డి కొమురయ్య అని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ బిసిసెల్ ఆధ్వర్యంలో ఆడిటోరియంలోని బిసి సెల్ కార్యాలయంలో సంచాలకులు డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన దొడ్డి కొమురయ్య 97వ జయంతి సభలో మాట్లాడుతూ నిజాం ప్రభుత్వానికి, రజకారులకు వ్యతిరేకంగా పోరాడిన స్ఫూర్తిప్రధాత అని కొనియాడారు. నేటి తరం యువత అయన లోని పోరాట స్ఫూర్తిని తెలుసుకోవాలన్నారు. విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనలో విశ్వవిద్యాలయం ముందు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దూరవిద్య సంచాలకులు ఆచార్య వి.రామచంద్రంతో పాటు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొని దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ప్రైవేటు జూనియర్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

- **డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నోముల కిషోర్**



నవతెలంగాణ-సుబేదారి

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా హనుమకొండ నగరంలో వేసవిలో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు జూనియర్ కాలేజీలపైచర్యలు తీసుకోవాలని కోరుతూ డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నోముల కిషోర్, కార్యదర్శి దొగ్గెల తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో ఏవో కృష్ణమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఇంటర్ బోర్డు సెక్రటరీ వేసవిలో ప్రైవేటుగా, ఇంటర్ తరగతులు, ఎంసెట్, ఐఐటి, నీట్ పేర్లతో కోచింగ్ నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేసినా దానికి విరుద్ధంగా హనుమకొండలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలు, తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నాయన్నారు. విద్యార్థుల మానసిక ప్రశాంతత కోసం సెలవులు అవసరం ఉన్నప్పటికీ, ర్యాంకుల కోసం ఫీజుల కోసం విద్యార్థులను ప్రైవేటు విద్యాసంస్థలు మానసికంగా తీవ్రంగా వేధిస్తున్నాయి. కోచింగ్, స్పెషల్ క్లాస్ ల పేరుతో విద్యార్థులను తల్లిదండ్రులను ప్రలోభాలకు గురిచేస్తున్నారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వేసవిలో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని,ముందస్తు అడ్మిషన్లను చేస్తున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలని, వినతిపత్రంలో కోరారు.

పంచాయతీలను పట్టించుకోని ప్రత్యేక అధికారులు

నవతెలంగాణ-ఆత్మకూరు

మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు సర్పంచుల పదవి కాలం ముగియడంతో ప్రభుత్వం వివిధ శాఖల నుండి గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది కొన్ని గ్రామాల్లో ప్రత్యేక అధికారులు ఏ ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో సమస్యల పేరుకుపోతున్నాయని రానున్న రోజుల్లో మంచినీటి ఎద్దడి,ఇతర ఇబ్బందులు కలుగుతున్న క్రమంలో అధికారులు చొరవ తీసుకొని గ్రామాల్లో మంచినీటి సౌకర్యం కల్పించే బాధ్యత గ్రామ కార్యదర్శితో పాటు ప్రత్యేక అధికారులు కూడా ఎంతైనా ఉందని గ్రామ ప్రజలు తెలియజేస్తున్నారు. ప్రత్యేక అధికారులు గ్రామ పంచాయతీలకు రాకుండా పోవడంపై అధికారుల నిర్లక్ష్యం వైఖరితో గ్రామాల్లో సమస్యలు పడకేశాయి. ప్రత్యేక అధికారులు రాకపోవడంతో పంచాయతీ కార్యదర్శులకు పని భారం కూడా పెరిగిపోతుందని వారు తెలిపారు. పేరుకు మాత్రమే ప్రత్యేక అధికారులు ఉన్నారని గ్రామాల్లో సమస్యలు పట్టింపేలేదని ప్రజలు తెలియజేస్తున్నారు. వెంటనే అధికారులు సమస్యలపై దృష్టిసారించి మంచి నీటి సౌకర్యంతో పాటు సమస్యలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

యూత్ కాంగ్రెస్ నాయకుడి ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-ఆత్మకూరు

మండలంలోని హౌజుబుజుర్గులో ముస్లిం సోదరులకు కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకుడు రేవూరి రణధీర్‌రెడ్డి సమక్షంలో ఇఫ్తార్ విందు జరిగింది. ఈ కార్యక్రమంలో మండల మైనార్టీసెల్ అధ్యక్షుడు ఖాజా, జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, హౌజుబుజుర్గు గ్రామపార్టీ అధ్యక్షుడు ఖాసిం, ప్రధాన కార్యదర్శి దామెర రాజు, యూత్ అధ్యక్షుడు షరీఫ్, మాజీసర్పంచ్ మిరియాల కుమార్ గుండెబోయిన అజయ్ దురిశెట్టి శ్రావణ్, మండల కుమార్, బొల్లెపల్లి సురేష్, సయ్యద్, కరీం తదితరులు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థ నిర్మూలనకే కొనుగోలు కేంద్రాలు



నవతెలంగాణ-శాయంపేట

రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని నేరుగా విక్రయించడానికి, దళారీ వ్యవస్థను నిర్మూలించడానికి పిఎసిఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, రైతులు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పిఎసిఎస్ సీఈవో రాజమోహన్ అన్నారు. మండలంలోని నేరేడుపల్లి, ప్రగతిసింగారం, కాట్రపల్లి, తహరాపూర్, మైలారం గ్రామాల్లో పిఎసిఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, బుధవారం సీఈవో రాజమోహన్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర అందజేస్తున్నట్లు తెలిపారు. గ్రామ రైతులు తాము పండించిన వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రైతుల బ్యాంకు ఖాతాలో నేరుగా డబ్బులు జమ అవుతాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిబ్బంది లింగమూర్తి, శంకర్, నాగరాజు, పోషాలు, హమాలీ సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కాజీపేట జంక్షన్ నిర్వీర్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర

- **మూడు క్రూ లింకుల తరలింపుయత్నం మానుకోవాలి**
- **సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.చుక్కయ్య**



నవతెలంగాణ-హన్మకొండ

వరంగల్ జిల్లా ప్రజలకు పెద్దదిక్కైన కాజీపేట రైల్వేజంక్షన్ నిర్వీర్యానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని, కాజీపేట జంక్షన్‌లో ప్రధానమైన మూడు క్రూలింకులను సికింద్రాబాద్‌కు తరలించే కుట్రలను తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎం.చుక్కయ్య పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సభ్యులు జంపాల రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎం. చుక్కయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కాజీపేట రైల్వే జంక్షన్ వెనుకబాటుకు గత ప్రభుత్వాలే కారణమని కాజీపేట రైల్వేకంట్రోల్ క్రూకంట్రోల్ నుండి క్రూలింకుల తరలింపును వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కాజీపేట రైల్వే జంక్షన్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేయాలని అనేక సంవత్సరాలుగా కార్మికులు అనేక ఉద్యమాలు చేస్తున్న పట్టించుకోకుండా కార్మిక వ్యతిరేక విధానాలతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. అలాగే రాజ్యాంగబద్ధంగా విభజన హామీలైన కాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్, ఓవరాలింగ్‌పరిశ్రమలు ఏర్పాటు కాకుండా గత పది సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుంటే ఆ కుట్రలో గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి కూడా భాగస్వామ్యం ఉందని ప్రధానంగా కాజీపేట రైల్వే జంక్షన్ వెనుకబాటుకు మోడీ కేసీఆర్ లే ప్రధాన అడ్డంకి అని విమర్శించారు. గత 20 సంవత్సరాలుగా కాజీపేట రైల్వే డివిజన్ కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్‌ఉన్న దానిని గత పాలకులు పట్టించుకోలేదని ఉన్న రెండు క్రూలింకులను కూడా విజయవాడకు తరలించగా కార్మికులు రాజకీయ పార్టీలు వివిధ ప్రజా సంఘాల ఉద్యమాల వలన దానిని విరమించుకుని ఇప్పుడు మూడు క్రూలింకులను సికింద్రాబాద్‌కు తరలిస్తున్నామని లోకోపైలెట్లకు సమాచారం అందించారని ఇలాంటి అర్థరహిత ఏకపక్ష నిర్ణయాలతో కార్మికుల పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఇప్పటికైనా ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాజీపేట రైల్వే జంక్షన్ ఉత్తర దక్షిణ భారతదేశంలో కూడలిగా ఉందని ఆదాయంలో సికింద్రాబాద్‌జోన్‌లోనే అత్యధికఆదాయాన్ని ఆర్జించిపెడుతుందని అలాంటి రైల్వేజంక్షన్‌ను అభివృద్ధి చేయాల్సింది పోయి నిర్వీర్యంచేసే కుట్రకు కేంద్ర ప్రభుత్వం పూనుకుంటుందని ఒకవేళ అదే జరిగితే గతంలో డోర్నకల్ రైల్వే జంక్షన్ వలే కాజీపేట రైల్వే జంక్షన్ కూడా అభివృద్ధికి దూరంగామారిపోతుందన్నారు. వేలాదిమంది కార్మికులు, అనుబంధ వ్యాపారస్తుల దీని మీద ఆధారపడి జీవిస్తున్నారని వారందరూ ఆర్థికంగా నష్టపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని గత ప్రభుత్వంమాదిరిగా కాకుండా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల పక్షపాతిగా వ్యవహరించి సికింద్రాబాద్‌కు తరలించే క్రూలింకులను తక్షణమే నిలిపివేయాలని లేనిపక్షంలో పార్టీలకు అతీతంగా అన్నిరాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, మేధావులు జిల్లా ప్రజలతో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహించడానికి కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో పార్టీ నాయకులు తొట్టె మల్లేశం, తిక్క సాంబయ్య, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

పంటలకు నీరు అందించాలి : ఎమ్మెల్యే



నవతెలంగాణ-కమలాపూర్

హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలో పంట పొలాలకు తక్షణం నీరందించాలని హుజురాబాద్ శాసనసభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఉప్పల్ గ్రామంలో కరీంనగర్ పార్లమెంటరీ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం మర్రిపల్లిగూడెం గ్రామంలో రైతుల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారులు నియోజకవర్గ రైతాంగంపట్ల కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని, పంటలు ఎండిపోతున్నా చోద్యంచూస్తూ కూర్చున్నారని దుయ్యబట్టారు. వెంటనే కెనాల్ గేట్లు ఎత్తి నీరందించాలని లేని పక్షంలో తామే కెనాల్ గేట్లు తెరిచి రైతులకు నీరు అందిస్తామని హెచ్చరించారు.రెండు రోజుల్లో పంటలకు నీరు అందని పక్షములో ఈ నెల 6న నియోజక వర్గం లో బారి ఎత్తున నిరాహార దీక్ష చేపడుతామని మరో సారి ప్రభుత్వానికి డెడ్ లైన్ పెడుతున్నట్లు తెలిపారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు వినోద్ కుమార్‌కు భారీమెజారిటీ అందిస్తారని,గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రజలు రైతులు గ్రామాలలో తిరగకుండా అడ్డుకుంటారని తెలిపారు.

మాజీ ఎంపీ వినోద్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కానీ హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మరొకసారి మోసం చేయకుండా ఉండాలంటే బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సంపత్ రావు, నవీన్ కుమార్, లక్ష్మణ్‌రావు, మాజీ సర్పంచ్ దేవేందర్‌రావు, తిరుపతిరావు తది తరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు న్యాయం

- **స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ సీఈవో రవి**



నవతెలంగాణ-కమలాపూర్

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని మండల స్పెషల్ ఆఫీసర్ డిప్యూటీ సీఈవో రవి అన్నారు. బుధవారం మండలంలోని ఉప్పల్, మర్రిపల్లి గూడెం, గుండేడు, శనిగరం, మాదన్నపేట్ ,గూనిపర్తి గ్రామాల్లో ఐకెపి వరి ధాన్యం కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ రైతులు పండించిన వరిధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే అమ్ముకోవాలని దళారులకు నమ్ముకొని మోసపోవద్దని అన్నారు. రైతు కొనుగోలు కేంద్రంలో విక్రయించి లబ్ధి పొందాలని, ఏ గ్రేడ్ వరి ధాన్యానికి రూ.2203, బి గ్రేడ్ రకానికి రూ.2183 మద్దతు ధర పొందాలన్నారు. ధాన్యంలో తేమశాతం 17 ఉండాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాబు, ఏవో లక్ష్మారెడ్డి ,ఏపీఎం నారాయణ,సీసీ లు కుమార స్వామి మమత, శ్రీదేవి, సదాలక్ష్మి మహేందర్, ఆయా గ్రామ సమాఖ్యల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ సభ్యులు, రైతులు, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

దేశంలో మోడీ నియంతృత్వ పాలనను అడ్డుకుందాం



- **వరంగల్‌లో కడియం కావ్యకు మద్దతు ఇవ్వండి**
- **సీపీఐ నాయకులను కోరిన రేవూరి, కడియం**

నవతెలంగాణ-హనుమకొండ

దేశంలో రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ ప్రశ్నించే గొంతులను అణిచివేస్తూ నియంతృత్వ పాలనను కొనసాగిస్తున్న నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని గద్దెదించాలనికాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి హనుమకొండ బాల సముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయానికి విచ్చేసి ఇండియా కూటమిలో ఉన్న సీపీఐ మద్దతు కోరుతూ సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులను కలిశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత గత పదేళ్లలో దేశ ఆర్థిక వనరులను కార్పొరేట్, పెట్టుబడిదారులకు దోచిపెట్టడమే పనిగాపెట్టుకున్నారని, హిందూత్వవాదం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తున్నారని అన్నారు. తమ మాట వినని వారిపై సీబీఐ, ఈడీ, ఐటీలాంటి సంస్థలను ప్రయోగిస్తూ ప్రశ్నించే గొంతులు లేకుండా చేస్తున్నారని, మరోవైపు దళితులు, మైనారిటీ వర్గాలపై దాడులు పెరిగాయని అన్నారు. ఈ క్రమంలోనే దేశంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంలతో సహాప్రాంతీయపార్టీలతో కలిసి ఇండియా కూటమిగా ఏర్పడడం జరిగిందన్నారు. ఈరోజు కూటమి అభ్యర్థిగా కాంగ్రెస్ నుండి పోటీ చేస్తున్న విద్యావంతురాలు కడియం కావ్యకు మద్దతు కోసం సీపీఐ, సీపీఎం నాయకులను కోరడం జరుగుతున్నదని చెప్పారు. కడియం శ్రీహరి ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీనియర్ రాజకీయ నాయకులుగా ఎమ్మెల్యే, ఎంపీ, డిప్యూటీ సీఎం గా పని చేశారని, కొందరు స్వార్థ పరులే ఆయనపై విమర్శలు చేస్తున్నారని అన్నారు.

మంద కృష్ణలాంటి వ్యక్తి తన వర్గ ప్రయోజనాల కోసం పోరాడకుండా బీజేపీకి ఏజెంట్‌గామారి మాదిగలకు ద్రోహం చేయాలని చూస్తున్నాడని విమర్శించారు. దళితులు, మైనార్టీలపై దాడులు చేసే బీజేపీకి వంత పాడుతూ మతతత్వ వాదాన్ని పెంచుతున్నాడని అన్నారు. మరోవైపు బీఆర్ఎస్ నాయకులు కూడా బీజేపీ కే పరోక్షంగా మద్దతు తెలుపుతూ కడియం పై విమర్శిస్తున్నారని అన్నారు. అలాగే రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని, కేసీఆర్ పైత్యం వల్లే కాళేశ్వరం రీడిజైనింగ్ జరిగి పనికి రాకుండా పోయిందని అన్నారు.

పార్టీ ఆదేశాల మేరకు పనిచేస్తాం : తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ముందుకు సాగుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు తెలిపారు. బీజేపీ పాలనలో గడిచిన పదేళ్లలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలను పెంచి సామాన్య ప్రజల జీవితాలపై పెనుభారం మోపారని అన్నారు. తమ ప్రధాన లక్ష్యం బీజేపీ ఓటమే నని బీజేపీకి వంత పాడుతున్న బీఆర్ఎస్‌ను కూడా పార్లమెంటు ఎన్నికలలో ఓడిస్తామని అన్నారు. ఇండియా కూటమి అభ్యర్థిగా కడియం కావ్య గెలిస్తేనే విభజన హామీలైన బయ్యారం ఉక్కు, కాజీపేట రైల్వే పరిశ్రమలు సాధ్యమని అన్నారు.

ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.విజయసారథి, ఎన్.జ్యోతి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్.రాజారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు కర్రె బిక్షపతి, మేకల రవి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, నాయకులు పంజాల రమేష్, ఆదరి శ్రీనివాస్, షేక్ బాషుమియా, పి.సుగుణమ్మ, మద్దెల ఎల్లేష్, బీఆర్.లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ : బొట్ల బిక్షపతి



నవతెలంగాణ-హన్మకొండ

అత్యధిక జనాభాకలిగిన మాదిగలకు లోక్ సభ ఎన్నికలలో వరంగల్ పార్లమెంట్ టికెట్ ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందని టిఎంఆర్పిఎస్ రాష్ట్ర వ్యవస్థాపన అధ్యక్షులు బొట్ల బిక్షపతి విమర్శించారు. బుధవారం హనుమకొండ అంబేద్కర్ విగ్రహం ఎదుట టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం బొట్ల బిక్షపతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మాదిగల జనాభా 90 లక్షలు ఉందని ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొమ్మిది లక్షల మాదిగల జనాభా ఉందని అలాంటి మాదిగలకు టికెట్ ఇవ్వకుండా స్వల్ప జనాభా కలిగిన బైండ్ల కులానికి చెందిన కడియం కావ్య కు కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్ ఇవ్వడం మాదిగలకు అన్యాయం చేయడమే అని విమర్శించారు. భారత దేశంలో కాంగ్రెస్ పార్టీ అనేక సంవత్సరాలు పరిపాలించడం కారణం మాదిగల ఓటు బ్యాంకు మాత్రమేనని మాదిగలను కాంగ్రెస్ పార్టీ ఓటు వేసే బానిసలు గానే చూస్తుందని రాజకీయంగా అవకాశాలు ఇవ్వకుండా వారిని అణిచివేస్తుందని అన్నారు. కాంగ్రెస్ లో మాలలకు ఉన్న గౌరవం మాదిగలకు లేదని తేలిపోయిందన్నారు. కడియం శ్రీహరి మాదిగలను రాజకీయంగా ఎదగనీయకుండా కుట్రలు పన్నుతు న్నారని బీఆర్ఎస్ పార్టీలో తన కూతురు కడియం కావ్యకు టికెట్ ఇచ్చినా ఆ పార్టీని మోసం చేసి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ మోసం చేయడానికి మరో కుట్రకు ప్లాన్ చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఎస్సీలు 20శాతం అయినా అందులో మాదిగల శాతం 14శాతం అయినా కూడా ఒక్క పార్లమెంట్ స్థానానికి కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా మేల్కొని తిరిగి పునర్ ఆలోచించి వరంగల్ పార్లమెంట్ టికెట్ మాదిగలకే ఇవ్వాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్ ఫార్మర్ చోరీ

నవతెలంగాణ-పాలకుర్తి రూరల్



మండలంలోని బొమ్మెర దుబ్బ తండా గ్రామంలోని ఎస్ఎస్ 40 నెంబర్ గల ట్రాన్స్ ఫార్మర్‌ను రాత్రివేళ మేన్‌లైన్ కట్‌చేసి ట్రాన్స్ ఫార్మర్‌లోని కాఫర్, అందులోని ఆయిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసి నట్టు రైతులు పెంతల మల్లారెడ్డి, లకావత్ యాకు, బానోత్ లక్కు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురికావడంతో ఆయా ప్రాంతాల రైతులు పంటలకు నీరు ఎలా పెట్టాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దొంగల దోపిడీతో చేతికొచ్చిన పంట నష్టపోయే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక ఎస్సై సాయి ప్రసన్న కుమార్‌ను సంప్రదించగా దుబ్బతండా రైతులు ట్రాన్స్ఫారం పోయిన దాని గురించి కంప్లైంట్ ఇచ్చారని, విద్యుత్ అధికారులతో కలిసి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలిగా డి.సుమ

నవతెలంగాణ-దేవరుప్పుల



స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా ఉపాధ్యక్షురాలుగా దాసగాని సుమను ఎన్నుకున్నట్టు జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మబిక్షం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏకశిలా డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ మూడవ మహాసభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని రామరాజుపల్లి గ్రామానికి చెందిన దాసగాని సుమను ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. జిల్లా కమిటీ సభ్యులుగా 19మందిని ఎన్నుకొని భవిష్యత్ కర్తవ్యాలపై తీర్మానాలు చేశామని ఆయన అన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని,ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయాలని,అదే విధంగా పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని తీర్మానం చేశామని అన్నారు. అనంతరం సుమ మాట్లాడుతూ విద్యా రంగ సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని,తమ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

వివిధ శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు శాఖల వారీగా వివరాలు అందించాలని అధికారులను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎసెన్షియల్ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అందజేసేందుకుగాను ంబంధిత శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ మాట్లాడుతూ శాఖల వారీగా పని చేస్తున్న ఉద్యోగులు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకునేందుకు పేరు, హోదా గుర్తింపు కార్డు నెంబరు సెల్ నెంబర్ వంటి పూర్తి వివరాలతో వారంలోగా నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ముందుగా శాఖల వారీగా సిబ్బంది సంఖ్యను వారి హెూదాను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రెస్ కవరేజీ విధులను నిర్వహిస్తున్న అక్రిడేటెడ్ పాత్రికేయులకు పార్లమెంటు ఎన్నికల కవరేజ్ కొరకు ఆథరైజేషన్ లెటర్ తో పాటు పోస్టల్ బ్యాలెట్ ను కూడా అందజేస్తామని, తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్, ఆర్డీవోలు కొమరయ్య, వెంకన్న జిల్లా అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



యూత్ సభ్యుల ఆర్థికసాయం

నవతెలంగాణ-తరిగొప్పుల

మండల పరిధిలోని అక్కరాజుపల్లి గ్రామనికీ చెందిన మంచినీళ్ల యాదయ్య బుధవారం మరణించడంతో గ్రామానికి చెందిన రైన్బో యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకం రాజు గారి ఆధ్వర్యంలో యూత్ సభ్యులు మతదేహనీ సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మతుడి కుటుంబానికి దహన సంస్కారాలు నిమిత్తం ఐదువేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రవి గౌడ్, రాజు గౌడ్,అనూప్,హరి ప్రసాద్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



ధ్యానం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్ : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్టేషన్ ఘనపూర్ ఎంపీడీఓ మానే ఉమాదేవి అన్నారు. బుధవారం మండల పరిధిలోని తాటికొండ మహెూదయ, కొత్తపల్లి మహాలక్ష్మి, శివుని పల్లి నవోదయ, పాంనూర్ నవత, థానేదార్ పల్లి శ్రీ వేంకటేశ్వర, అక్కపల్లి గూడెం జై హనుమాన్ గ్రామైఖ్య మహిళా సంఘాలతో ఆయా గ్రామాల్లో ఏపీఎం కుమారస్వామి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఓ ప్రేమయ్య, పంచాయితీ కార్యదర్శులు శ్రీకాంత్, వేణు గోపాల్, శేఖర్, ఏఈఓ లు ప్రతిభ, ఈశ్వరి, సీసీలు యాకయ్య, యాదగిరి, ఉమా రాణి, రజిని, ఆపరేటర్ మహేందర్, వీఓఏలు హైమావతి, యాకలక్ష్మి, మల్లిక, పావని, రజిని, క్రిష్ణ లీల, జయశ్రీ, సుమతి, సరిత, హారిక, తదితరులు పాల్గొన్నారు.

లింగాలఘనపురం

మండలంలోని జీడికల్ గ్రామం ఐకెపి ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని ఆర్ఐ కిషోర్ బుధవారం ప్రారంభించారు. రైతులు ధ్యానం కొనుగోలు కేంద్రాలు ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏ గ్రేడ్2260 రూపాయలు, సి గ్రేడ్ 2240 రూపాయలు మద్దతు ధర పొందాలని కోరారు. ఈవో స్పందన సీసీ శ్రీమతి, వీవోఏలు సునీత, రమా, స్వప్న సిసి వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.



డీపీఓ కార్యాలయంలో చెత్తాచెదారం

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

నిత్యం జిల్లా ప్రజలతో కిటకిటలాడే జిల్లా సచివాలయంగా చెప్పుకునే కలెక్టరేట్ చెత్తగా మారింది. జిల్లాలోని 250 పైగా ఉన్న గ్రామపంచాయతీ నుంచి వచ్చే అధికారుల, ప్రజాప్రతినిధుల, ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే జిల్లా పంచాయతీ కార్యాలయం ఎదుట చెత్తగా మారింది. ఆ విషయాన్ని చూసిన జిల్లా ప్రజలందరికీ పరిశుభ్రత, పరిసరాల గురించి చెప్పే అధికారులకు ఈ విషయం పట్టడం లేదా అని ముక్కున వేలేసుకుని పక్కున నవ్వుతున్నారు.జిల్లాను పరిపాలించే అధికారులు ఈ విషయంలో ప్రజలకు ఏం సమాధానం చెబుతారో మరీ..



కొమురయ్య ఆశయాలు కొనసాగిద్దాం

నవతెలంగాణ-లింగాలఘనపురం

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగింద్దామని కొమురవెల్లి దేవస్థానం మాజీ చైర్మన్ సంపత్, కురుమ సంఘం మండల అధ్యక్షుడు చంద్రమౌళి అన్నారు. దొడ్డి కొమురయ్య 97వ జయంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు మల్లేశం, విజయభాస్కర్, వెంకటేష్, శేఖర్, మధు ,తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను ఎన్నికల విధుల నుంచి తొలగించాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి

నవతెలంగాణ-జనగామ



ఎన్నికల కోడ్‌తో ప్రతిపక్ష పార్టీలకు, ముఖ్యంగా సీపీఐ(ఎం) లాంటి ప్రజాక్షేత్రంలో ప్రజల పక్షాన నిలబడే పార్టీకి జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా సమయం ఇవ్వకపోవడం, వారితో చర్చించకపోవడం, వారితో అమర్యాదగా మాట్లాడటం దారుణమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. ఎన్నికల నిబంధనల పేరుతో కమ్యూనిస్టులను ప్రజలను ఇబ్బంది పెట్టే ధోరణి తప్ప ఇంకోటి కాదని తెలిపారు. తెలంగాణలో కొత్తగా ఏర్పడ్డ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు దగ్గర కావడం కోసం ప్రజా పాలన నిర్వహిస్తుంటే కలెక్టర్ రిజ్వాన్ భాషా గత ప్రభుత్వంలో దర్బారు పాలన కొనసాగించాలనుకుంటున్నారని ఆరోపించారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గంలోని జనగామ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా జరగాలంటే తక్షణం కలెక్టర్‌ను జిల్లా ఎన్నికల అధికారి విధులనుంచి తొలగించాలని ఎన్నికల కమిషన్‌ను సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు బూడిది గోపి. సిపిఎం పట్టణ కార్యదర్శి జోగు, ప్రకాష్ జిల్లా కమిటీ సభ్యులు సుంచు, విజయేందర్ పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణం లింగం, బిట్ల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం,వీవీ పాడ్‌ల మొదటి దశ ర్యాండమైజేషన్



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

పార్లమెంటు ఎన్నికలలో భాగంగా పారదర్శకంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి దశ ఈవిఎం, వివి ప్యాడ్ యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్, ఆర్డీవోలు తో కలసి జిల్లా ఎన్నికల అధికారి ఈవిఎం యంత్రాల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ, భారత ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా జనగామ జిల్లాలో మొదటి ఈవిఎం ల ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా చేపట్టామని తెలిపారు. జిల్లాలోని 98-జనగాం, 99-ఘన్పూర్ స్టేషన్, 100-పాలకుర్తి నియోజకవర్గాలకు సంబంధించి 869 పోలింగ్ కేంద్రాలకు ఆన్ లైన్ ద్వారా ఈ.వీ.ఎం.లను కేటాయించడం జరిగిందన్నారు. జిల్లాలో ఉన్న జనగాం నియోజకవర్గం పరిధిలో 278 పోలింగ్ కేంద్రాలకుగాను 347 కంట్రోల్ యూనిట్లు, 347 బ్యాలెట్ యూనిట్లు, 389 వి.వి.ప్యాట్‌లు అదేవిధంగా ఘన్పూర్ స్టేషన్ నియోజకవర్గానికి సంబంధించి 295 పోలింగ్ కేంద్రాలకు కాను 368 కంట్రోల్ యూనిట్ లు, 368 బ్యాలెట్ యూనిట్లు, 413 వి.వి. ప్యాట్ లను, పాలకుర్తి నియోజకవర్గానికి సంబంధించి 296 పోలింగ్ కేంద్రాలకు కాను 370 కంట్రోల్ యూనిట్ లు, 370 బ్యాలెట్ యూనిట్లు, 414 వి.వి. ప్యాట్ లను, మొత్తంగా 869 పోలింగ్ కేంద్రాలకు 1085 బ్యాలెట్ యూనిట్లు 1085 కంట్రోల్ యూనిట్లు,1216 వివి ప్యాట్ లకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆన్‌లైన్ విధానం ద్వారా పారదర్శకంగా ర్యాండమైజేషన్ నిర్వహించి కేటాయించడం జరిగిందన్నారు. మొదటి ర్యాండమైజేషన్ కు సంబంధించిన హర్డ్ కాపీలు, సాఫ్ట్ కాపీలు రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించడం జరుగుతుందని తెలిపారు. పార్టీ ప్రచారంలో వినియోగించే సామాగ్రికి సంబంధించి రూపొందించిన ధరల పట్టికలను పార్టీ ప్రతినిధులకు అందిస్తూ దానిపై అభ్యంతరాలను సత్వరమే అందించాలన్నారు. కార్యక్రమంలో ఘన్పూర్ స్టేషన్, జనగాం ఆర్డీవోలు వెంకన్న, కొమరయ్య, కలెక్టరేట్ ఏవో రవీందర్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాసరావు, తహసిల్దార్ లు, ఈడీఎం దుర్గారావు ఎస్ఐసి జాయింట్ డైరెక్టర్ అఖిలపక్ష పార్టీల ప్రతినిధులు కాంగ్రెస్ చెంచారపు శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ రావెల రవి, బీజేపీ ఏగుర్ల విజయభాస్కర్, సీపీఐ(ఎం) విజయేందర్, జోగు ప్రకాష్, టీడీపీ తేజావత్ అజయ్ కుమార్, బీఎస్పీ మడిపడిగ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులకు సకాలంలో హాజరు కావాలి

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

నవతెలంగాణ-భూపాలపల్లి



పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ విధులు నిర్వహించనున్న పిఓలు, ఎపిఓలకు 4, 6 తేదీల్లో నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమానికి సకాలంలో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశపు హాలులో ఏప్రిల్ 4, 6 వ తేదీల్లో పీఓ, ఏపీవోలకు శిక్షణా కార్యక్రమంపై సిబ్బంది మేనేజ్మెంట్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు, సిపిఓ, మత్స్య శాఖ, డిపిఓ, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలు, మాస్టర్ ట్రైనర్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పీఓ, ఎపిఓలకు ఏప్రిల్ 4 మరియు 6 తేదీలలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహణకు షెడ్యూల్ రూపొందించినట్లు తెలిపారు. విధులు కేటాయించిన సిబ్బంది అందరూ శిక్షణకు హాజరయ్యేలా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. శిక్షణా కార్యక్రమాలకు హాజరు కాకుండా ఎలాంటి మినహాయింపు లేదని తప్పని సరిగా హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు. శిక్షణకు విచ్చేయు సిబ్బంది ఉదయం 10 గంటల వరకు ఆయా కేంద్రాలకు చేరుకుని హాజరు ఫారంలో సంతకం చేయాలని తెలిపారు. ఉదయం, సాయంత్రం రెండు విడతల హాజరు తీసుకోవాలని, గైర్హాజరైన సిబ్బంది జాభితా అందచేయాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మాంటిసోరి హై స్కూల్‌లో శిక్షణా కేంద్రాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోనే శిక్షణా కేంద్రాలు ఉన్నందున సిబ్బంది క్రమశిక్షణ పాటించి నిర్దేశిత సమయంలోగా చేరుకోవాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి అనుమతి లేకుండా ఎవరైనా శిక్షణ కార్యక్రమాలకు గైర్హాజరైతే ఎన్నికల సంగం నిబంధనలు మేరకు క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు. పీఓ, ఎపివోలకు పోస్టల్ బ్యాలెట్ జారీ చేసేందుకు ఫారం 12, విధులు కేటాయించిన ఉత్తర్వులు ప్రతి, ఎన్నికల సంగం గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు)తో పాటు ఫారం 12 నందు ఓటు హక్కు కలిగిన పార్లమెంట్, శాసనసభ నియోజకవర్గాలు, పోలింగ్ స్టేషన్ నంబర్, ఓటరు జాభితాలోని క్రమసంఖ్య తప్పని సక్రమంగా నమోదులు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిబ్బంది మేనేజ్మెంట్ నోడల్ అధికారులు శామ్యూల్, అవినాష్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి నారాయణరావు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడీవోలు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీలపై కేసులు నమోదు చేయాలి

డీవైఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కోకన్వీనర్ గడ్డం కవిత

నవతెలంగాణ-భూపాలపల్లి

వైద్య ఆరోగ్యశాఖ నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేకున్నా వైద్యం చేస్తు ప్రజలను మోసం చేస్తున్న ఆర్ఎంపీల, పీఎంపీలపై సమగ్ర విచారణ జరిపి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కో కన్వీనర్ గడ్డం కవిత అన్నారు బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ...ఈ మధ్యకాలంలో వైద్య ఆరోగ్యశాఖ టనేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాఊ నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేకున్నా వైద్యం చేస్తూ ఇంజక్షన్స్ సెలైన్సు రక్త మూత్ర పరీక్షలు చేస్తూ ల్యాబ్స్ మెడికల్ షాపులు నడిపిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామంటూ విడుదల చేసిన పత్రికా ప్రకటనను మేము ఆహ్వానిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు.

కానీ దీనిపైన పూర్తిస్థాయి దృష్టి పెట్టి జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామీణ స్థాయిలో సేవ పేరుతో మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల నమ్మకాన్ని వారి అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని పేద ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ వైద్యం వైపు మరలకుండా అర్హత అనుభవం లేకున్నా ధనార్జనే ధ్యేయంగా కార్పొరేటు ప్రైవేటు హాస్పటల్లో బహుమతులు తీసుకుంటూ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

కమిషన్ల కోసం పేద ప్రజలను రెఫర్ చేస్తూ వైద్యం చేస్తున్న మెడికల్ రిజిస్టర్ బోర్డులో నమోదు కాకుండా లెటర్ హెడ్స్ మెయింటైన్ చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో కొంత మంది నకిలీ ఆర్.ఎం.పి, పి.ఎం.పి వైద్యులపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి వారి మెడికల్ షాపులు ల్యాబ్స్ సీజ్ చేసి వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.రెండు రోజులలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా ని కలిసి ఆధారాలతో సహా వివరాలను అందిస్తామని ఆమె తెలిపారు.జిల్లా వైద్యాధికారి మధుసూదన్‌కి డివైఎఫ్ఐ తరపున వాట్సప్ ద్వారా అందించిన ప్రథమ చికిత్స కేంద్రాల నిర్వహకులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వడ్డెరులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

మంత్రి సీతక్కకు వినతి అందించిన జిల్లా అధ్యక్షులు గండికోట వెంకటస్వామి

నవతెలంగాణ-ములుగు



వడ్డెరలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు గండికోట వెంకటస్వామి ఆధ్వర్యంలో బుదవారం తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంత్రి దనసరి సీతక్క నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రంలో వెనకబడిన వడ్డెర్లకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం తెలంగాణ వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ ములుగు జిల్లా అధ్యక్షుడు గండికోట వెంకటస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల మేనిఫెస్టోలో వడ్డెర కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారన్నారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన మంత్రి వర్గ సమావేశంలో 16 కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి వడ్డెర కులాన్ని విస్మరించారాని అన్నారు. కార్పొరేషన్‌పై అసంతప్తి చెందిన వడ్డెర కులస్తులంతా వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు కోసం తెలంగాణ రాష్ట్రంలోని 119 మంది ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతి పత్రాలు అందిస్తున్నామని అన్నారు. పార్టీలు మారుతున్నాయి, పాలకులు మారుతున్నారు కాని ఇనాతీగా వడ్డెర్ల జీవితాలు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి వడ్డెర కులాన్ని ఎస్టీలో చేర్చుతామని బహిరంగ సభలో ప్రకటించారు. తెలంగాణ స్వరాష్ట్రం ఏర్పడ్డాక అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ వడ్డెర కులాన్ని ఎస్టీలో చేర్చాలని వడ్డెర సంఘం నాయకులు పలు సార్లు వినతులు కోరారు, అనేకమార్లు కలెక్టర్ ఆఫీసులు అసెంబ్లీ ముందు ఇందోళన చేశామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, గొల్లెన సారంగపాణి జిల్లా గౌరవ అధ్యక్షులు, ఆలకుంట రమేష్ , వెంకటాపురం మండల అధ్యక్షులు, గొల్లెన వెంకటేష్, ములుగు నాయకులు, గొల్లెన సంతోష్, గండికోట సిద్ధూ, అల్లేపు రాజు, వల్లెపు శ్రీకాంత్ ,వల్లెపు రవి, సంపంగి సురేష్ పాల్గొన్నారు.

జీడికల్ చెక్కపోస్టు వద్ద రూ.లక్ష సీజ్

నవతెలంగాణ-లింగాలఘనపురం

మండలంలోని జీడికల్ గ్రామంలో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన చెక్కపోస్టు వద్ద బుధవారం ఎలాంటి అనుమతి లేకుండా లక్ష రూపాయల తరలిస్తున్న వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్టు ఎస్ఐ రాజు తెలిపారు. వీరితో పాటు ఆర్ఐ కిశోర్, ఏఈఓ స్పందన పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కన్వీనర్‌గా రాజేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

నియోజక వర్గ బీజేపీ మీడియా కన్వీనర్‌గా మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన తౌటిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి ఎన్నికైనట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని బుధవారం రాజేశ్వర్‌రెడ్డికి అందజేశారు. తన నియామకం పట్ల జిల్లా, నియోజక వర్గ, ప్రముఖ నాయకులకు కతజ్ఞతలు తెలిపారు. తనకు అందించిన పదవితో పార్టీ ఉన్నతికి బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-స్టేషన్ ఘనపూర్

మండలంలోని శివునిపల్లి గ్రామంలో రాష్ట్ర రూరల్ డెవలప్మెంట్ అధ్యక్షులు గుర్రం యేసుబాబు తండ్రి గుర్రం చంద్రయ్య (70) మరణించగా, జెడ్పీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ మారపాక రవి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట డాక్టర్ లక్కాకుల జగన్, డాక్టర్ కొంగర కుమార్, గుర్రం శంకర్, గుర్రం శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

-కేసులు నమోదు -తహసిల్దార్ ముందు బైండోవర్

నవతెలంగాణ-గణపురం

మండలంలోని బసవరాజు పల్లి గ్రామంలో గుడుంబా స్థావరాలపై చిట్యాల సిఐ మల్లేష్ ఎస్సై మచ్చ సాంబమూర్తి ఆధ్వర్యంలో బుధవారం దాడులు చేసి గుడుంబాను ధ్వంసం చేశారు. అనంతరం గుడుంబా దారులపై కేసులు నమోదు చేసి తహసిల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు తెలిపారు ఈ సందర్భంగా సిఐ మల్లేష్ మాట్లాడుతూ గుడుంబా తయారుచేసిన అమ్మిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థిక చేయూత

నవతెలంగాణ-చిట్యాల

మండలంలోని జడల పేట గ్రామపంచాయతీ పరిధి గాంధీ నగర్ లో గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించిన మిత్రుడు బొట్ల రమేష్ కుటుంబానికి జనగామ గురుకుల ఇంటర్మీడియట్ 2008-2010 మిత్రబందం బుధవారం ఆ కుటుంబాన్ని కలిసి మిత్రుడిని కోల్పోవడం బాధాకరమని పరామర్శించి వారికి తమ ప్రగాఢ సానుభూతి తెలుపుతూ 20,500 రూపాయలు ఆర్థిక సాయం చేశారు. తదుపరి ఆ కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ అన్ని విధాలుగా అండగా ఉంటామని ఇంటర్మీడియట్ మిత్ర బందం తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోయిన వారికి ఆసరాగా నిలిచినందకు మిత్రులను స్థానికులు అభినందించారు.

ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు

నవతెలంగాణ-చిట్యాల

మండల కేంద్రంలోని చింతలపల్లి గ్రామంలో ఘనంగా పోచమ్మ తల్లి బోనాల పండగ నిర్వహించారు. బుధవారం మండల కేంద్రం పరిది చింతలపల్లిలో గ్రామస్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పోచమ్మ తల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటపాటలతో బోనమెత్తి పోచమ్మ తల్లికి భక్తి శ్రద్ధలతో మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామస్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్ ఒకరిపై కేసు నమోదు

నవతెలంగాణ-చిట్యాల

అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ ను పట్టుకొని సీజ్ చేసి డ్రైవర్, ఓనర్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు. బుదవారం ఆయన తెలిపిన ప్రకారం మండలంలోని జడల్పేట గ్రామ శివారు మీదుగా కాలువ పెల్లి వైపు నుండి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ ను ఆపి కాగితాలు పరిశీలించగా ఏలాంటి పత్రాలు లేవని తెలపడంతో ట్రాక్టర్లును స్వాధీన పరుచుకుని డ్రైవర్ ఒనర్ చిలముల రమేష్, పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.. అక్రమ ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు.

చలివేంద్రం ప్రారంభం

నవ తెలంగాణ-మంగపేట

మండలంలోని కమలాపురం గ్రామంలో జ్వాలయూత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆ ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేసవిలో ఎండలు తీవ్రంగా ఉన్నాయని కావున ప్రజలు ఇంటి నుండి బయటకు వచ్చేటప్పుడు కనీస జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చలివేంద్రం ఏర్పాటుకు రాధా స్టీల్ ప్రతినిధులు, కమలాపురం గ్రామపంచాయతీ వారు మంగపేట పోలీసులు సహకరించారని ఆయన తెలిపారు. జ్వాలా ట్రస్ట్ ఎల్లప్పుడు ప్రజాసేవలో ముందుంటుందని భవిష్యత్ లో మరిన్ని మంచి కార్యక్రమాలు చేస్తామని నరేష్ వెల్లడించారు. చలివెంద్రం ఏర్పాటుకు సహకరించిన రాధా స్టీల్ ప్రతినిధులకు మరియు మండల స్పెషల్ ఆఫీసర్ తులా రవికి, మంగపేట పోలీసులకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపాడు. ఈ కార్యక్రమంలో రాధా స్టీల్ ప్రతినిధులు అశ్విని కుమార్ దస్తగిరి, బబ్లు, కమలాపురం గ్రామపంచాయతీ అధికారులు, మండల ప్రత్యేకాధికారి తుల రవి, జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ము రాకేష్, కార్యదర్శి ఆత్మకూరు సతీష్, ప్రచార కార్యదర్శి గగ్గూరి మహేష్, గౌరవ సలహాదారులు సయ్యద్ బాబా, మునిగల వెంకటేశ్వర్లు, వెంకట్ రెడ్డి ,శ్రీధర్ , జెడ్పీఎస్ఎస్ కమలాపురం హెడ్మాస్టర్ శ్రీనివాస్ ,కార్యవర్గ సభ్యులు రోహిత్, సూర్య, సందీప్, సత్యనారాయణ పాల్గొన్నారు.

వరంగల్ ఎంపీ బరిలో 'బొమ్మకంటి'

నవతెలంగాణ-ములుగు

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ ఎంపిగా తెలంగాణ ప్రజా సేన వ్యవస్థా పకులు బొమ్మ కంటి రమేష్ వర్మ బరిలో దిగనున్నారు. అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల మధ్యలో నిత్యం తిరుగుతూ ప్రజల సమస్యలు తీరుస్తున్నాడు వరంగల్ ప్రజలు ఆశీర్వదించి గెలిస్తే ప్రశ్నించే గొంతుకనై ప్రజల సమస్యలు తీరుస్తాను అన్ని రమేష్ వర్మ అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ ప్రజల సమస్యల పై పోరాటం చేస్తున్నట్లు ప్రతి గడపకి తిరుగుతానని అన్నారు. మనకు తెలంగాణ రాష్ట్రంలో విద్య వైద్యం ఫ్రీగా అందించాలని తన వంతు పోరాటం చేస్తాను అన్నారు. ప్రజలు తనను ఆశీర్వదించాలని రమేష్ వర్మ తెలిపారు.

కొమురయ్య ఆశయాలను కొనసాగించాలి

నవతెలంగాణ-మల్హర్‌రావు

దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగించాలని,ఆయన జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని యాదవ సంఘం,ప్రజాసంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి.బుధవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూల మాల వేసి ఘనమైన నివాళులార్పించారు.

బాలల గుర్తింపును వెల్లడించొద్దు

చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నాగవేణి



నవతెలంగాణ-మహబూబాబాద్

ఏదైనా సంఘటనలో బాధిత అమ్మాయి పేరు, వారియొక్క కుటుంబ వివరాలను పేపర్లో ప్రచురించకూడదని సెక్షన్ 74 ప్రకారం 0-18 సంవత్సరాలు ఉన్న బాధిత పిల్లల పేర్లు, వారి యొక్క కుటుంబ వివరాలను తెలియ పరచకూడదని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నాగవేణి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని పత్రికల్లో అమ్మాయి పేరు, వారియొక్క కుటుంబ వివరాలను ప్రచురిస్తున్నారని అన్నారు. పిల్లల వ్యక్తి గత వివరాల గోప్యతకు భంగం కలిగించకూడదని, ఒకవేళ అలా చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఎలక్ట్రానిక్ అండ్ ప్రింటింగ్ మీడియా వారు బాధిత పిల్లల వివరాలను, ఫోటోలను పేపర్‌లో ప్రచురించొద్దని సూచించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



నవతెలంగాణ-తొర్రూర్‌రూరల్

తొర్రూర్ ఎక్సైజ్ శాఖ పరిధిలోని గ్రామాల్లో నాటు సారా తయారు చేస్తూ విక్రయిస్తున్న కేంద్రాలపై మహబూబాబాద్ డీపీఈఓకిరణ్ పర్యవేక్షణలో తొర్రూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు తండాలలో నాటు సారా స్థావరాలపై మెరుపు దాడులు నిర్వహించారు. స్టేషన్ పరిధిలోని సుందర్ తండా, సంధ్య తండా, అమర్ సింగ్ తండాలలో దాడులు నిర్వహించి మూడు ద్విచక్ర వాహనాలు, 50 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. సుమారు 1500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్ఓ ఆర్ ప్రవీణ్ తెలిపారు. ఎవరైనా నాటు సారాయి తయారుచేసిన అమ్మిన రవాణా చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు కే తిరుపతి, నవీన్ సిబ్బంది సత్య ప్రకాష్, ప్రభాకర్, మదర్ ఖాన్ పాల్గొన్నారు.



కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు

హనుమండ్ల ఝాన్సీ రెడ్డి

నవతెలంగాణ-పెద్దవంగర

గ్రామీణ ప్రాంతాల్లోని కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి పట్టుకొమ్మలని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి హనుమండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రెడ్డికుంట తండాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు బానోత్ శంకర్, బానోత్ బుచ్చి రాములు అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకుని, వారిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ధైర్యం చెప్పారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం లో కార్యకర్తల కృషి ఎనలేనిదన్నారు. పార్టీ కోసం అహర్నిశలు గా పని చేసే కార్యకర్తల కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటామని చెప్పారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఇన్చార్జి విజయ్ పాల్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రంగ మురళి గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పాడిశెట్టి సైదులు గౌడ్, రెడ్డికుంట తండా మాజీ సర్పంచ్ బానోత్ జగ్గా నాయక్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, ధారవత్ శంకర్ నాయక్, బానోత్ గోపాల్, వీరా రెడ్డి, బిక్షం, యాకూబ్, వెంకన్న, రాజారాం, గవాస్కర్, నరేందర్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

నవతెలంగాణ-గార్ల

వేసవికాలంలో రోజుకు రోజు పెరుగుతున్న ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని అత్యవసర సమయాలలో మాత్రమే బయటకు వెళ్లాలని మండల వైద్య అధికారి డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య శాఖ, రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ అధికారులతో స్థానిక తహశీల్దారు కార్యాలయంలో బుధవారం సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలు అత్యవసర పరిస్థితులలో తప్ప బయటకు వెళ్లకూడదని సూచించారు. అత్యవసర పరిస్థితులలో బయటకు వెళ్ళాల్సి వస్తే తెల్లని కాటన్ దుస్తులు, గొడుగు ధరించాలని, తల మీద క్యాప్ పెట్టుకోవాలని, నిత్యం మంచి నీళ్లను, పండ్ల రసాలు, ఉప్పు కలిపిన మజ్జిగ, ఓ ఆర్ ఎస్ వంటి పానీయాలను సేవించాలని చెప్పారు.వడదెబ్బకు గురైన వెంటనే చల్లని ప్రదేశాలకు తరలించి, తడి గుడ్డతో శరీరాన్ని తుడిచి, చల్లటి ఫ్యాన్ గాలికి ఉంచాలని ఆరోగ్య పరిస్థితి విషమిస్తే వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని సూచించారు.సమావేశంలో తహశీల్దారు రవీందర్, ఎస్ ఐ జీనత్ కుమార్, డిప్యూటీ తహశీల్దారు సుధాకర్ నాయక్, డా, అనిల్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన్నగూడూరు : ఎండ తీవ్రతను దష్టిలో పెట్టుకొని వ్యక్తులు ఆరోగ్య సూత్రాలను పాటించాలని ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎండ తీవ్రత, అకస్మాత్తుగా వచ్చే గుండె జబ్బు నియంత్రణలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. ఎండ తీవ్రతను బట్టి పిల్లలు వద్దుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయ కూడదన్నారు. ఎండలో ప్రయాణించి ఇంటికి చేరుకున్న సమయంలో చల్లని పానీయాలు సేవించకూడదన్నారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మహబూబ్ అలీ,ఎంపీడీవో రామారావు,ఎస్ఐ ఝాన్సీ, ఎంపీఓ యాకయ్య, పంచాయతీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

మార్కెటింగ్ డీపీఎం నళిని నారాయణ

నవతెలంగాణ-పెద్దవంగర

రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని మార్కెటింగ్ డీపీఎం నళిని నారాయణ అన్నారు. బుధవారం మండలంలోని బంగారు చెలిమి తండా, బొమ్మకల్లు, వడ్డెకొత్తపల్లి, కొరిపల్లి, ఉప్పెరగూడెం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. వడ్డెకొత్తపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. యాసంగిలో రైతుల సౌలభ్యం కోసం ముందుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వేసవిని దష్టిలో ఉంచుకొని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని మౌలిక వసతులను నిర్వాహకులు ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి, మట్టి, తాలు లేకుండా కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ యశస్విని, సీసీలు జీ. సుధాకర్, బీ. సుధాకర్, పద్మ, ఆపరేటర్ అనిల్, ట్యాబ్ ఆపరేటర్ నిర్మల, వీవో అధ్యక్షురాలు స్వాతి, మంజుల, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఇనుగుర్తి : మండలంలోని చిన్ననాగారం గ్రామంలో రాజమాత వివో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అగ్రికల్చర్ ఏవో రవీందర్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో రవీందర్ రెడ్డి మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని చిన్న నాగారం గ్రామంలో వరికోతలు ప్రారంభించారని తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో ఐకెపి సీసీ వెంకటయ్య, ఏ ఈ ఓ సుమన్, కమిటీ సభ్యులు మరియు రైతులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం)తోనే ప్రజాసమస్యల పరిష్కారం

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్



నవతెలంగాణ-మహబూబాబాద్

సీపీఐ(ఎం)తోనే ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. బుధవారం సీపీఐ(ఎం) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గాయత్రి గుట్టమల్లు స్వరాజ్యం నగర్‌కాలనీ కురవి గేట్ సమీపంలోని కొత్త భూపోరాట కేంద్రంలో గుడిసెవాసుల పార్టీ సభ్యత్వాలు రెన్యూవల్ సందర్భంగా సమావేశం పేరుమాండ్ల జగన్నాథం భవనంలో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి పట్టణ కార్యదర్శి బానోతు సీతారాంనాయక్ అధ్యక్షత వహించగా శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. పేదరికం పోవాలంటే కమ్యూనిస్టు పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లుకావస్తున్నా పేదవాడు పేదవాడిగానే ఉన్నాడని, ధనవంతుడు రోజు రోజుకు మరింత సంపదను పోగేసుకొని ధనవంతుడిగా పెరిగిపోతున్నారని అన్నారు. ప్రతి ఎన్నికల్లో ప్రజలను ఉచిత పథకాల పేరుతో అధికారంలోకి వస్తున్నారు కానీ ప్రజలకు కనీస అవసరాలు కూడా ఈ బూర్జువా పాలక పార్టీలు తీర్చడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రజలకోసం ప్రాణాలు అర్పించి లక్షలాది ఎకరాల భూమీ పంపిణీ చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని, అలాంటి పార్టీలో సభ్యులుగా చేరటం మన కర్తవ్యంగా భావించాలన్నారు. సమావేశంలో కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సూర్నపు సోమయ్య, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు అల్లి శ్రీనివాస్‌రెడ్డి, రావుల రాజు, పట్టణ కమిటీ సభ్యులు యమగని వెంకన్న, తోట శ్రీనివాస్, బానోతు వెంకన్న, బూర్గుల లక్ష్మణ్, బానోతు ప్రకాష్, బానోతు శ్రీరామ్, బానోతు మోతీలాల్, వీరేశ్, బందోజు సునీత, విజయలక్ష్మి, తేజావత్ ప్రవీణ్, లక్ష్మీ, అన్వేష్ పాల్గొన్నారు.

దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకెళ్లాలి



ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్

నవతెలంగాణ-మహబూబాబాద్

దివ్యాంగులు మన ధైర్యంతో ఆత్మవిశ్వాసంతో అభివద్ధి పథంలోకి దూసుకెళ్లాలని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ ఆకాంక్షించారు. మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని సిగ్నల్ కాలనీ పరిధిలో బుధవారం ఇండియన్ క్రిస్టియన్ మినిస్ట్రీస్ వారి ఆధ్వర్యంలో వికలాంగులకు ఉచిత వీల్ చైర్లను ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ పంపిణీ చేశారు.ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని వారిని మనస్ఫూర్తిగా అభినందించారు ఈ వికలాంగుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని అదే విధంగ మనో ధైర్యంతో ముందుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో వార్డు నాయకులకు జిల్లా నాయకులు మండల నాయకులు పట్టణ నాయకులు యూత్ లీడర్లు కౌన్సిలర్లు చర్చి పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపులో వ్యాపారులు కీలక పాత్ర

మహబూబాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపులో తాను ఎమ్మెల్యేగా విజయం సాధించడంలో వ్యాపార వాణిజ్య వర్గాలు కీలక పాత్ర పోషించారని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్ మానుకోటలోనిలోని శ్రీనివాస థియేటర్ సెంటర్లో వ్యాపార వాణిజ్య వర్గాలను పలకరించి తనను గెలిపించినందుకు కతజ్ఞతలు అభినందనలు తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మానుకోటకు చేసిందేమీలేదన్నారు. నాటి పాలకులు అభివద్ధి పథకాల పేరుతో వ్యాపారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.మానుకోట నియోజకవర్గ ప్రజలకు విద్యా వైద్యం త్రాగునీరు సాగునీరుతో పాటు పట్టణాలు పల్లెలు సమాంతరంగా అభివద్ధి చెందేలా ప్రత్యేక ప్రణాళికతో కాంగ్రెస్ ప్రజాపాలన కొనసాగిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో నాళ్ల వీరన్న, సదాశివుడు సూరయ్య వ్యాపారులు పాల్గొన్నారు.

గ్రామదేవతల పండుగలు సమైక్యతకు చిహ్నం

తెలంగాణ సంస్కతి సంప్రదాయం ప్రతిబింబించడంలో గ్రామ దేవతల పండుగలు సమైక్యతకు చిహ్నంగా నిలుస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ అన్నారు. బుధవారం మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల గ్రామంలో బొడ్రాయి పునఃప్రతిష్టాపన (శిల నాభి) ప్రారంభోత్సవం కార్యక్రమంలో వేదపండితులు కుల పూజారుల సమక్షంలో నవధాన్యాలు వేసే కార్యక్రమంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కామ సంజీవ రావు, సీపీఐ మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి, అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ ఇనుగుర్తి సుధాకర్, బండారు వెంకటరమణ, బొడ్డుగొండ మాజీ సర్పంచ్ ముక్కా లక్ష్మణ్ రావు రెడ్యాల గ్రామస్థులు పాల్గొన్నారు.

చలో తుక్కుగూడ జన జాతర సభను జయప్రదం చేయండి

కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రకటన కోసం తుక్కుగూడలో నిర్వహించే జన జాతర సభను జయప్రదం చేయాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ కోరారు. బుధవారం మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాల అధ్యక్షులతో ముఖ్య నాయకులతో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ నెల 6వ తేదీన తుక్కుగూడలో జరగబోయే జన జాతర మహాసభకు భారీ ఎత్తున జనా సమీకరణ చేయాలని, నాలుగు మండలాల అధ్యక్షులకు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు.రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నాయకులను కార్యకర్తలను కోరారు.

ఈవీఎంల మొదటి విడత ర్యాండమైజేషన్

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్



నవతెలంగాణ-మహబూబాబాద్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల మొదటి విడత కేటాయింపులు పూర్తి అయ్యాయని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అన్నారు. బుధవారంకలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లాలోని రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత ఎన్నికల అధికారుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)ల మొదటి విడత ర్యాండమైజేషన్, ఎన్నికల సంఘం సూచనల మేరకు పూర్తి ఆన్లైన్ విధానం ద్వారా కేటాయించినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఈ కేటాయింపుల ద్వారా (689) బ్యాలెట్ యూనిట్స్, (689) కంట్రోల్ యూనిట్స్, (760) వీవీ ప్యాట్స్ ర్యాండమైజేషన్, ద్వారా సెగ్మెంట్లా వారిగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం) గోడౌన్ నుండి అందరి సమక్షంలో సంబంధిత స్ట్రాంగ్ రూములకు పంపడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు ఎన్.సురేష్ నాయుడు, , మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న , సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, బిజెపి కొమ్మల్ రెడ్డి, టిడిపి రమణ, ఆర్డిఓలు నరసింహారావు అలివేలు,ఎలక్షన్ సూపరింటెండెంట్ పవన్ కుమార్, డి.ఎస్.పి తిరుపతిరావు, సంబంధిత ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

మరిపెడ మండల ప్రెస్ క్లబ్ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-మరిపెడ

మరిపెడ మండల ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీనియర్ జర్నలిస్టులు, ఎన్నికల అబ్జర్వర్లు శ్రీరంగం శ్రీనివాస్, గాడిపల్లి శ్రీశైలం తెలిపారు. ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడు గంధసిరి ఉప్పలయ్య(సాక్షి), అధ్యక్షుడు మహ్మద్ రియాజ్ పాషా(స్పాట్ వాయిస్), ప్రధాన కార్యదర్శి రాంపెల్లి విరాంజి (ఎన్ టీవీ) ఉపాధ్యక్షులు బోడ నాగేందర్(వార్త), మూడ్ శ్రీ కుమార్(నిజం), సహాయ కార్యదర్శులు ఎం. మహేందర్(స్వతంత్ర), షేక్ షానవాజ్(గౌతమ్), మాలోత్ తిరుపతి(సూర్య), ట్రెజరర్ మచ్చ రాజేష్(వెలుగు), ఆర్గనైజింగ్ సెక్రటరీ జిన్నా లచ్చయ్య(నవతెలంగాణ), సహాయ సెక్రటరీ పోతుల గోవర్ధన్(మన తెలంగాణ), కార్యవర్గ సభ్యులు ఎం సంజీవ(రాజ్ న్యూస్), బోడ శ్రీను(జ్యోతి), బోడపట్ల వెంకన్న(వాస్తవం), వీవీ నర్సింహారెడ్డి(లోకల్), బీఎస్ రాజు(కాకతీయ), కే సాయికుమార్(పల్లెవాణి) కమిటీ గౌరవ సలహాదారులుగా శ్రీరంగం శ్రీనివాస్(ఈనాడు), గాడిపల్లి శ్రీశైలం(ఆంధ్రజ్యోతి), పి.వేణుగోపాల్ (సాక్షి రూరల్), షేక్ సత్తార్ పాషా(వరంగల్ వాయిస్), గంధసిరి రవి (ముద్ర), భర్తారపు వెంకట మల్లేషం (ప్రజాతంత్ర) ఎన్నికైనట్లు ఎన్నికల అబ్జర్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మహ్మద్ రియాజ్ పాషా మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నిక చేసినందుకు అందరికి కతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల సాధనకు కషి చేస్తాననని, సమస్యల సాధనకు, వర్కింగ్ జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణ తరగతుల ఏర్పాటుకు కషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు వంకాయలపాటి తిరుమలరావు, ఐ రాజేష్, ఆర్ వెంకటేశ్వర్లు, ఉమేష్, మహిబాబు, సురేష్, పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



నవతెలంగాణ-గార్ల

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకొని ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులకు సహకరించాలని గార్ల-బయ్యారం సీఐ భూక్య రవికుమార్,ఎస్సై ఎస్.జీనత్ కుమార్‌లు కోరారు. కమ్యూనిటీ పోలిసింగ్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని ఎర్రమట్టి తండాలో బుధవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రవికుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో ఓటు హక్కు వినియోగం అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎవరి రాజకీయ పార్టీల అభిమానం వారికి ఉంటుందన్నారు. ఎన్నికల సమయంలో సహనం పాటిస్తూ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించడంతో పాటు గ్రామంలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు. మోసపూరిత సైబర్ నేరగాళ్ల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయామని గుర్తించిన వెంటనే స్థానిక పోలీసు స్టేషనులో సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిల్, పోలీసు సిబ్బంది శ్రీనివాస్, రాము ఉన్నారు.



తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

ఎంపీడీవో విక్రమ్

నవతెలంగాణ-దంతాలపల్లి

వేసవికాలం దష్ట్యా గ్రామాల్లో త్రాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో విక్రమ్ అన్నారు. మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో బుధవారం సందర్శించారు. ఇటీవల ఆ గ్రామంలో మిషన్ భగీరథ పైపులైన్లు లీకేజీ కావడంతో సంబంధిత అధికారులు మరమ్మతులు చేయించారు. మిషన్ భగీరథతో పాటు గ్రామంలోని ఆయా బోరు బావులలో నూతన మోటార్లను బిగించిన పనులను పరిశీలించారు. తాగునీటి సరఫరా నిమిత్తం మిషన్ భగీరథ ద్వారా అందుబాటులో ఉన్న వ్యవస్థను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజు ఉదయం 8గంటలకు గ్రామపంచాయతీలో ఉండాలన్నారు.ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సుజనా, కారోబార్ వెంకన్న, మల్లేశ్ ,శ్రీను, ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

పెద్దవంగర : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుదవారం పెద్దవంగర గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఎంపీడీవో ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ఎండల తీవ్రత అధికంగా ఉందని, ప్రయాణికులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థిక స్తోమత కలిగిన దాతలు విరివిగా చలివేంద్రాలను ప్రారంభించాలని కోరారు. సేవా కార్యక్రమాలు చేపట్టడంలో యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకన్న, నర్సింహా మూర్తి, రాజు, అశోక్ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో ఆఫీసులో హెల్ప్ లైన్ సెంటర్

నవతెలంగాణ-మహబూబాబాద్

ఎండ తీవ్రతను దష్టిలో ఉంచుకొని జిల్లాలో డీఎంహెచ్వో కార్యాలయంలో హెల్ప్ లైన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి కళావతిభాయి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం, ప్రత్యేకంగా 24 గంటల పాటు పని చేసేలా హెల్ప్ సెంటర్ ఏర్పాటు చేశారన్నారు, ఎవరైనా వడదెబ్బకు గురి అయిన ఎండకు అపస్మారకస్థితి చేరుకున్న సమాచారాన్ని జిల్లా కేంద్రంలోని 9676621992 నెంబర్‌కు తెలియజేస్తే తక్షణమే అందుబాటులో ఉన్న అంబులెన్స్‌తో పాటు చికిత్సలు అందిస్తామని జిల్లా వైద్యాధికారి నేడు ఒక ప్రకటనలో తెలిపారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-దంతాలపల్లి

మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు అధికారులు, ముందుకొచ్చి చలివేంద్రాలను ఏర్పాటు ప్రయాణికులకు దాహం తీర్చాలని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా మండల అధ్యక్షులు చిల్ల రామకష్ణ ముదిరాజ్ కోరారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల పనుల నిమిత్తం, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈఓ, అగ్రికల్చర్, పోలీస్ స్టేషన్, మీసేవ కార్యాలయాలకు ప్రభుత్వ ఆసుపత్రికి ఆయా ఆఫీసులకు మారుమూల గ్రామాల నుంచి ప్రతిరోజు వందలదిమంది వస్తుంటారు. వచ్చిన పనులు సకాలంలో పూర్తికాక ప్రభుత్వ అధికారుల కొరతతో ప్రజలు ఆఫీసుల ముందు పడిగాపులు కాస్తుంటారు. కాబట్టి వేసవి కాలంలో అత్యధిక ఉష్ణోగ్రత ఉండటం వల్లన మండుటెండలకు వచ్చే ప్రజలకు మండల కేంద్రంలో అంబేద్కర్ సెంటర్ సమీపంలో చలివేంద్ర కేంద్రాలను ఏర్పాటు చేస్తే చాలామందికి దాహం తీర్చే వాళ్ళం అవుతామని ప్రజలు కోరుకుంటున్నారు.

టెట్ పరీక్ష ఫీజును తగ్గించాలి

డీఎడ్ అండ్ బీఎడ్ సంఘం రాష్ట్ర నాయకులు -బానోత్ రమేష్ నాయక్

నవతెలంగాణ-మరిపెడ

భారీగా పెంచిన టెట్ ఫీజును తగ్గించాలని నిరుద్యోగులపై భారాన్ని ఉపసమరించుకోవాలని డీఎడ్ అండ్ బీఈడీ సంఘం రాష్ట్ర నాయకులు బానోత్ రమేష్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మరిపెడ మండల కేంద్రంలోని ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగులు వేల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ లు తీసుకొని ప్రభుత్వ అసమర్థ వల్ల పరీక్ష రాయలేక పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో నిరుద్యోగులు ఆర్థికంగా మానసికంగా నష్టపోతారని వారందరికీ న్యాయం జరగాలంటే టెట్ దరఖాస్తు ఫీజును తగ్గించాలని డిమాండ్ చేశారు. గతంలో ఒక పేపర్‌కు 300, రెండు పేపర్లకుగాను 400 రూపాయలు ఫీజు ఉండేదని ప్రస్తుత నోటిఫికేషన్ లో మాత్రం ఏకంగా ఐదు రెట్లు పెంచి 2000 రూపాయలు వసూలు చేయడం వలన నిరుద్యోగులకు భారంగా మారిందని పేర్కొన్నారు. గతంలో టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు సైతం ఎక్కువ మార్కుల కోసం మరోసారి టెట్ రాయలనుకునే అభ్యర్థులకు ఫీజు భారంగా మారిందని తెలిపారు. ఇప్పటికైనా పెంచిన ఫీజును తగ్గించి ఎస్టి, ఎస్సీ, వికలాంగులకు ఫీజులో రాయితీ ఇవ్వాలని ఆయన కోరారు.



సుధాకర్‌రావు సేవలు చిరస్మరణీయం

నవతెలంగాణ పెద్దవంగర

చెన్నూరు (పాలకుర్తి) దివంగత మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావు సేవలు చిరస్మరణీయమని ఆయన సోదరుడు నెమరుగొమ్ముల ప్రదీప్‌రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముత్తినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంలో సుధాకర్ రావు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు, ఉపాధి హామీ కూలీలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుధాకర్‌రావు అటు వైద్య రంగంతో పాటుగా, రాజకీయాల్లో ఆయన అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మల్లికార్జునాచారి, మొర్రిగాడుదుల శ్రీనివాస్ గౌడ్, కేశబోయిన కుమారస్వామి, బొల్లు ఉషయ్య, కేశబోయిన సుభాష్, బొల్లు కుమారస్వామి, శ్రీరాం నవీన్, సతీష్ పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందిని విక్రమార్క

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్



భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కాసింపల్లి 13వ వార్డులో గల చర్చి పాస్టర్ మోకిడి డానియల్ రాజ హెళమ్మ దంపతుల కూతురు పూజిత- అభితేజ దంపతుల వివాహ వేడుకకు బుధవారం తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని విక్రమార్క హాజరై నూతన వధూవరులైనా పూజిత -అభితేజ్ దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ డానియల్ కుటుంబ సభ్యులు మోకిడి రాజ్ కుమార్, అనుష, అశోక్, వెంకటస్వామి, రామ్ చరణ్, మనోజ్, చిన్న సంపత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళపల్లి బాలరాజు, గుమాస భూమయ్య, జోరు రాము, జోరు వెంకటస్వామి, బండారి రవి, మహిళా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గట్టమ్మ దేవాలయం హుండీ ఆదాయం 42, 225

ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్

నవతెలంగాణ - ములుగు



జాకారం పరిధిలోని గట్టమ్మ దేవాలయం మేడారం జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన హుండీని బుధవారం రోజున ఆదివాసీ నాయకపోడ్ గట్టమ్మ పూజరుల ఆధ్వర్యంలో గట్టమ్మ ఆలయ నిర్వహణ అధికారుల ఆధ్వర్యంలో హుండీ విప్పి లెక్కించినట్లు ఆలయ కార్యనిర్మాణాధికారి బిళ్ళ శ్రీనివాస్ తెలిపారు. ఈ లెక్కింపులో నోట్లు రూ. 39,070-00 లు, నాణెములు రూ. 3155-00 లు మొత్తం రూ. 42,225-00 లుగా వచ్చినవి, బంగారం, వెండి, విదేశీ కరెన్సీ లు ఏమి రాలేదన్నారు.ఈ కార్యక్రమములో దేవాదాయ శాఖ పరిశీలకులు, పరకాల విభాగం డి. అనిల్ కుమార్, ఆలయ కార్యనిర్వాహణాధికారి బి. శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, ఆదివాసీ నాయకపోడ్ గట్టమ్మ పూజర్లు కొత్త సదయ్య, కె లక్ష్మయ్య కె. సురేందర్, ఎ. రవి, చిర్ర సుభద్ర, ఆకుల లక్ష్మి, అచ్చ రాజు, భక్తులు పాల్గొన్నారు.



పాలకులం కాదు సేవకులమే...

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

నవతెలంగాణ-భూపాలపల్లి

పాలకులం కాదు నిరంతరం ప్రజా సేవకులమేనని , కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని, వరంగల్ పార్లమెంటు స్థానాన్ని గెలిపించుకొని సోనియా, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి లకు కానుకగా ఇవ్వాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భూపాలపల్లి రూరల్, పట్టణ ముఖ్య కార్యకర్తలతో వేరు వేరుగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాలకు భూపాలపల్లి రూరల్, పట్టణ అధ్యక్షులు సుంకరి రామచంద్రయ్య, ఇస్లావత్ దేవన్ లు అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణ రావు మాట్లాడుతూ..

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఎలాంటి అభివద్ధి చేయలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేయకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. దళితులకు మూడెకరాల భూమి దళిత బంధు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిరుద్యోగ భతి హామీలు ఇచ్చి గత ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. ప్రజల సౌకర్యార్థం సింగరేణి ఆసుపత్రిలో మూడు కోట్లతో స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని వంద పడకల ఆసుపత్రిలో ఎమ్మారై స్కాన్ అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ఇదే ఆసుపత్రిలో 203 పోస్టులను భర్తీ చేయడం జరిగిందని తెలిపారు. సుమారు 53 కోట్లతో సిసి రోడ్లు ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న కాలంలో మహిళలకు 2500 రూపాయలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పేదల పార్టీ అని తెలంగాణ ఇచ్చిన పార్టీని ఆదరించాలన్నారు. పేదల ఇండ్లలో వెలుగు నింపే కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకు అహర్నిశలు కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తప్పకుండా అవకాశాలు వస్తాయని అన్నారు. ఈ సమావేశాలల్లో డిసిసి అధ్యక్షులు అయిత ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి గాదర్ల అశోక్, పీసీసీ సభ్యులు చల్లూరి మధు, పరకాల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చాడ రఘునాథ్ రెడ్డి, జిల్లా నాయకులు బుర్ర కొమురయ్య రామినేని రవీందర్, అప్పం కిషన్, పిప్పాల రాజేందర్ సాంబమూర్తి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పట్టణ కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు, పలు గ్రామాల సర్పంచ్ లు, ఎంపీటీసిలు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



బహుజనుల రాజ్యాధికారం కోసమే మా పోరాటం

పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్

నవతెలంగాణ-మల్హర్ రావు.

బహుజనుల రాజ్యాధికారం కోసమే మా పోరాటం కొనసాగుతూనే ఉంటుందని పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా దొడ్డి కొమురయ్య విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు దొడ్డి కొమురయ్య భూస్వామ్య పెత్తందారి వ్యవస్థపై పోరాటం చేశారని, మహనీయులు చాకలి ఐలమ్మ, జ్యోతిబాపూలే, దొడ్డి కొమురయ్య, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లాంటి మహనీయుల స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నా వారి చరిత్రను తెలుసుకోకపోవడం బాధాకరమన్నారు. మహనీయుల స్ఫూర్తిని రిజర్వేషన్లతో ఎదిగిన నాయకులు తెలుసుకోలేక పోవడం మూలంగానే ఇంకా బానిసలు ఉంటున్నామని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బీసీలు, ఎస్సీలకు రాజ్యాధికారం రాదనేది గత ఎన్నికల్లోనే నిరూపణ అయిందన్నారు. అంబేద్కర్ అందించిన రిజర్వేషన్లను అనుభవిస్తూ వారి స్ఫూర్తిని అర్థం చేసుకోకపోవడం మూలంగానే మూడు ఓట్లు ఉన్నోళ్లు యాభై ఏండ్లుగా పరిపాలన చేస్తున్నారని ఆయన అన్నారు. ఏప్రిల్ మాసమంతా మహనీయుల మాసమని ఈ క్రమంలో మహనీయుల స్ఫూర్తితో నియోజకవర్గంలో బలహీనవర్గాలకు రాజ్యాధికారం కోసం పోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్ర స్థాయికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

నవతెలంగాణ- ములుగు



తెలంగాణ కమిషనర్ ఫర్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టు' లో ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి మూడు ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొప్పుల మల్లేశం పేర్కొన్నారు. బుధవారం హైదరాబాదులో రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న పోటీలో సర్టిఫికెట్స్, జ్ఞాపికను బహుకరిస్తారు. కళాశాల తెలుగు విభాగధిపతి డాక్టర్ జి మహేందర్ ఆధ్వర్యంలో ఐదుగురు విద్యార్థులు ఆర్ రమ్య, ఎంయు వరలక్ష్మి, ఆర్ పావని, జి దీపిక, బి శ్రావ్య "సమకాలిన తెలుగు దినపత్రికలలో సాహిత్యం- పరిశీలన" అను అంశంపై చేసిన పరిశోధన ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. అదేవిధంగా జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఐదుగురు విద్యార్థులు కే రాజేష్, కే నీలిమ, పి శిరీష, ఎస్ నిహారిక, పి. పునిత లు "ఇంపాక్ట్ అఫ్ పెస్టిసైడ్స్ ఆన్ సాయిల్ ఆర్థోప్రాట్స్ ఇన్ మైజా ఫీల్డ్స్ ఇన్ మదనపల్లి విలేజ్ ఆఫ్ ములుగు డిస్ట్రిక్ట్" అనే అంశంపై చేసిన పరిశోధ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎన్నికయిందన్నారు. గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జయశంకర్ ఆధ్వర్యంలో ఐదుగురు విద్యార్థులు బి మౌనిక, సి.హెచ్. రవళి, బి నాగరాజు, పి ధర్మారెడ్డి, పి. శ్రీకాంత్ లు " డిఫరెన్షియల్ ఈక్వేషన్స్ అండ్ అప్లికేషన్స్" అనే అంశంపై చేసిన పరిశోధన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైంది"న్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన పరిశోధన ప్రాజెక్టుల పర్యవేక్షకులను, విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ తో పాటు, వైస్ ప్రిన్సిపల్ కే రజనీలత, అధ్యాపకులు శ్రీకాంత్, వెంకన్న, డాక్టర్ మహమ్మద్ యాకూబ్, డాక్టర్ నాగమణి, డాక్టర్ యోగేందర్, డాక్టర్ సమ్మయ్య పాల్గొన్నారు.

త్యాగాల కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబం

రాహుల్ గాంధీ ని ప్రధాన మంత్రి చెయ్యడమే మన లక్ష్యం

మోడీకి కార్పొరేట్ కంపెనీల మీద ఉన్న ప్రేమ దేశ ప్రజల మీద లేదు

ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ ను భారీ మెజార్టీ తో గెలిపించాలి

ములుగు, వేంకటా పూర్ మండలాల కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్క

మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బలరాం నాయక్

నవతెలంగాణ- ములుగు

మోడీ కి కార్పొరేట్ కంపెనీల మీద ఉన్న ప్రేమ దేశ ప్రజల మీద లేదనీ రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు.ములుగు మండలం లోని ఇంచేర్ల గ్రామం ఎంఆర్ గార్డెన్ లో ములుగు, వేంకటా పూర్ మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ లు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టిన కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని ప్రధానిగా చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ అంటే సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించే పార్టీ అని, గతంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, భూ పంపిణీ, ఉపాదిహామీ, తదితర అనేక ఫలాలను అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదని చెప్పారు. గ్రామాలు, మండలాలు, బూతుల వారీగా కార్యకర్తలంతా కలిసి సమీక్ష చేసుకోవాలన్నారు.

ఏండ్ల నుంచి ఎన్నో ఒడుదొడుకులను ఓర్చుకొని పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ప్రజలతో మంచి సంబంధాలు కలిగి ఉన్న ఇతర పార్టీల వారిని స్థానిక కార్యకర్తల సూచన మేరకే పార్టీలో చేర్చుకుంటామన్నారు. కొత్త, పాత అనే విభేదాలను పక్కన పెట్టాలని సూచించారు. పార్లమెంట్ స్థానం గెలుపుకోసం కార్యకర్తలు పనిచేయాలని. పార్టీకి సేవలు చేసిన కార్యకర్తకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు.

బీజేపీ పార్టీ రైతుల సంక్షేమాన్ని మరిచి కార్పొరేట్ సంస్థల కోసం పనిచేస్తున్న పార్టీ అని మంత్రి సీతక్క అన్నారు.



కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల కోసం పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు రైతులకు రుణమాఫీ చేసి పేద బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ పార్టీ ప్రకటించిన పథకాలు ప్రజలకు అందుతున్నది శూన్యమని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రజలకు దగ్గరగా ఉండి పని చేయాలని సూచించారు. ఎన్నికల్లో కార్యకర్త పనితీరును బట్టే భవిష్యత్‌లో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు నా అండ ఉంటుందని మంత్రి సీతక్క అన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పోరిక సాయి శంకర్,తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కొత్తదనం కనిపించాలి

కలెక్టర్ భవేష్ మిశ్రా

నవతెలంగాణ-భూపాలపల్లి



మన స్కూల్, మన పిల్లలు బంగారు భవిష్యత్తు కోసం చేపడుతున్న పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పనులను పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పూర్తి చేసి కొత్తదనం కనిపించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయపు సమావేశపు హాలులో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పన, ఏకరూప దుస్తులు (యూనిఫామ్స్) కుట్టుట, మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మత్తులు, విద్యుత్ సౌకర్యం తదితర అంశాలపై యంపిడిఓలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఏపియంలు, జిల్లా, మండల మహిళా సమాఖ్యల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురువారం మండలస్థాయిలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్లు, మండల ప్రత్యేక అధికారులు, యంపిడిఓలు, యంపిఓలు, ఇంజనీరింగ్, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఏపియంలు, మహిళా సమాఖ్యల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం నిర్వహించి పాఠశాలల్లో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు కల్పనపై సమావేశం నిర్వహించాలని తెలిపారు. ప్రతి పాఠశాలను పరిశీలించి చేపట్టాల్సిన పనులకు అంచనా ప్రతిపాదనలు తయారు చేసి వారంలో నివేదికలు అందచేయాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు ద్వారా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పన పనులు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్, మంచినీరు, మరుగుదొడ్లు, మరమ్మత్తులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించి పాఠశాలాలను సుందరంగా, ఆహ్లాదకరంగా తయారు చేయాలని తెలిపారు. గ్రామంలోని మహిళా సంఘాల ద్వారా విద్యార్థులకు ఏకరూప దుస్తులు (యూనిఫామ్స్) కుట్టించాలని అన్నారు. పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిసరాలు పరిశుభ్రం చేసి ఆహ్లాదకరంగా తయారు చేయాలని తెలిపారు. పాఠశాలలో మురుగునీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి మురుగునీరు నిల్వలు లేకుండా పరిశుభ్రం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 450 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని వాటిలో 149 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని, మిగిలిన 301 పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటిల ద్వారా మౌలిక సదుపాయాలు కల్పనకు పనులు చేపట్టాలని తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ ఇద్దరి పేరున సంయుక్తంగా బ్యాంకు ఖాతా ప్రారంభించాలని నిధులు అట్టి బ్యాంక్ ఖాతాలో జమచేయనున్నట్లు తెలిపారు. ఖర్చు చేస్తున్న ప్రతి పైసాకు తప్పక రిజిస్టర్ లో వ్రాయాలని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన బోధన చేసేందుకు చేపట్టిన ఈ మౌలిక సదుపాయాల కల్పన పనులు ఒక బహత్తర కార్యక్రమమని, ఇన్నోవేషన్ ఆలోచనతో ప్రతి మండలంలో రెండు ఆదర్శ పాఠశాలలను తయారు చేయాలని తెలిపారు. సమస్యలు వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి ఇబ్బందులు లేకుండా పాఠశాలలలో ఆహ్లాదకరమైన వాతా వరణం కల్పించేందుకు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 13వ తేదీ నుండి పనులు సప్రారంభం కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల్లో నాణ్యత పర్యవేక్షణ భాధ్యత మహిళా స్వయం సహాయక సంగాలదేనని, చాలా ప్రధానమైన పాత్ర ఉందన్నారు. ప్రతి తరగతి గదిలో లైట్లు, ఫ్యాన్లు ఉండాలని తెలిపారు. పనులు పర్యవేక్షణ బాధ్యతలు పంచాయతి రాజ్ ఇంజినీరింగ్ శాఖకు 7 మండలాలు, గిరిజన ఇంజినీరింగ్ సంక్షేమ శాఖకు 1, అదేవిధంగా టీఎస్ఈడబ్ల్యూఐడిసి శాఖకు 3 చొప్పున కేటా యించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జడ్పి సీఈవో విజయలక్ష్మి, డి ఆర్ డి ఓ నరేష్, జిల్లా విద్యాశాఖ అధికారి రామ్ కుమార్, డిపిఓ నారాయణరావు, సెక్టోరల్ అధికారి కిషన్ రావుతో పాటు మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, జల మహిళా సమాక్య అధ్యక్ష కార్యదర్శులు బండారి మంజుల, స్వరూప, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఏపీఎంలు పాల్గొన్నారు.



సైబర్ నేరాల నియంత్రణే లక్ష్యంగా పనిచేయాలి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే

నవతెలంగాణ-భూపాలపల్లి

సైబర్ నేరాల నియంత్రణ లక్ష్యంగా పనిచేయాలని పెరిగిపోతున్న సాంకేతికతకు తగ్గట్టుగానే, సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీస్ శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రతీ పోలీస్ స్టేషన్ లో ఒకరిని సైబర్ వారియర్ గా నియమించి వారికి మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు అందజేయడం జరిగిందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పి కిరణ్ ఖరే అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నూతనంగా సైబర్ క్రైమ్ డిఎస్పిగా బాధ్యతలు చేపట్టిన ఎస్.సుభాష్ బాబు, ఎస్పిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ....సైబర్ నేరాలను నియంత్రించడం, ప్రజలు సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే అన్ని స్థాయిల పోలీస్ అధికారులు సైతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సైబర్ క్రైమ్స్ పట్ల మరింత అవగాహన కలిగివుండాలని పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ లో సైబర్ సెక్యూరిటీ ప్రతినిధిని కేటాయించామని, సైబర్ నేరాల బారిన పడిన ప్రజలు వెంటనే 1930 కి కాల్ చేయడం గానీ, ఎ సీ్సఆర్పే పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. బాధితులు ఫిర్యాదులను నమోదు చేసుకుంటేనే గుర్తించడం సులువవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పి, డిసిఆర్బి ఇన్స్పెక్టర్లు వసంత్ కుమార్, రామకష్ణ, సైబర్ సెల్ కో- ఆర్డినేటర్ స్వామి గౌడ్ ఉన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు : ఏపిఎం

నవతెలంగాణ-మంగపేట



రైతులు వరిధాన్యం విక్రయించడంలో మధ్య వర్తులు, దళారులను నమ్మి మోసపోవద్దని ఐకెపి ఏపిఎం అప్పారావు అన్నారు. బుధవారం మండలంలోని మల్లూరు, రమణక్కపేట, గంపోనిగూడెం గ్రామాలలో సెర్ప్ డిఆర్.డిపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మద్దతు ధర లభించే కొనుగోలు కేంద్రాలలో మాత్రమే రైతులు తమ ధాన్యాన్ని విక్రయించాలని అన్నారు. ప్రైవేట్ వ్యక్తులకు దళారులకు విక్రయిస్తే తూకంలో మోస పోవడమే కాక మద్దతు ధర కూడా లభించదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిసిలు జనార్ధన్, శ్రీను, రైతులు,గ్రామైక్య సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్‌కు ఎన్‌సిసి దోహదపడుతుంది

నవతెలంగాణ-మొగుళ్ళపల్లి



విద్యార్థుల ఉజ్వల భవిష్య త్‌కు ఎన్‌సిసి దోహదపడుతు oదని మొట్లపల్లి జెడ్పిహెచ్ ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంపత్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని మొట్లపల్లి జెడ్పిహెచ్ ఎస్ పాఠశాల ఆవరణలో పదవ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ అజయ్ నందన్ కందూరి ఆదేశంతో పదవ తెలంగాణ హావల్దార్ మేజర్ ప్రదీప్ మనే, ఎన్‌సిసి అధికారి గుండెల్లి రాజయ్య ఆధ్వర్యంలో 2024?25 సంవత్స రానికి గాను ఎన్ సి సి విద్యార్థుల ఎంపిక నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంపత్ కుమార్ మాట్లాడుతూ ఎన్. సీ.సీ తో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవడానికి సువర్ణ అవకాశమన్నారు.ఎన్ సి సి తో క్రమశిక్షణ, దేశభక్తి ,శారీరక ,మానసిక ,అభివద్ధితో పాటు విద్యా, ఉద్యోగాలలోను, ఉన్నత చదువులు చదువుటకు, రిజర్వేషన్ సౌకర్యం కలదన్నారు. విద్యార్థిని విద్యార్థులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్సిసి అధికారి గుండెల్లి రాజయ్య మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థిని విద్యార్థులకు రెండు సంవత్సరాలు శిక్షణ ఉంటుందని శిక్షణలో క్రమశిక్షణ,దేశభక్తి, ఆర్మీ జీవితం ,డ్రిల్లు, ఆయుధాల శిక్షణ, జాతీయ సమైక్యత, ఆపత్కాల సమయంలో స్పందించేటువంటి విధానం, వివిధ అవగాహన కార్యక్రమాలు, మొక్కలు నాటుట, వివిధ రకాల క్యాంపులలో పాల్గొనుట, తదితర అంశాల గురించి శిక్షణ ఉంటుందన్నారు. విద్యార్థుల యొక్క సంపూర్ణ వికాసానికి ఈ శిక్షణ తోడ్పడుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరయ్య,ఉమారాణి, రవీందర్, గ్లోరీ రాణి, శ్రీధర్ స్వామి, మధుసూదన్, రవి ప్రసాద్, రాజ్ కుమార్, రజక్, సిద్ధు, అక్షిత విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

గుత్తి కోయ గిరిజనులకు ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి.

నవతెలంగాణ-ములుగు



గుత్తి కోయ గిరిజనులకు ఆరోగ్యం పై ప్రత్యేక అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.బుదవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ములుగు సామాజిక ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వెంకటాపూర్ మండలం పరిధిలోని తొర్రిచింతలపాడు గుత్తి కోయ గ్రామానికి చెందిన ఇద్దరి కవలలకు జన్మనిచ్చిన గుత్తి కోయ బాలింత మహిళకు ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్యం పరిస్థితిని కలెక్టర్ స్వయంగా మహిళను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గుత్తి కోయ గిరిజన గ్రామాలలో మహళలకు రెవిన్యూ , పోలీస్ , వైద్యాధికారుల సమన్వయంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు కల్పించాలని సూచించారు. మహిళలు ప్రెగ్నెన్సీ విషయంలో జాగ్రత్త పాటించాలని సొంత వైద్యం తో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో చికిత్స చేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా గుత్తి కోయ గ్రామాలపై ఆశ వర్కర్స్ ఏఎన్ఎంలు అప్రమత్తంగా ఉండాలని గర్భిణీ స్త్రీల విషయంలో పూర్తి వివరాలు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నమోదు చేయాలని, డెలివరీ సమయం లో వారితో మాట్లాడి ముందుగానే ఆరోగ్య కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అలేం అప్పయ్య , సామాజిక ఆరోగ్య కేంద్ర ఏైద్య అధికారి డాక్టర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలు ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

ఉపాధిహామీ పథకం మండల ఏపీఓ హరీష్

నవతెలంగాణ-మల్హర్‌రావు



జాబ్ కార్డున్న ప్రతి కూలీ ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపాధిహామీ పథకం మండల ఏపీఓ గిరి హరీష్ సూచించారు.బుధవారం మండలంలోని మల్లారం గ్రామపంచాయితీ పరిధిలో చెరువు పూడికతీత పనులు పరిశీలించారు.మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంపై కూలీలకు అవగాహన కల్పించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 100 రోజుల పాటు ఉపాధిహామీ కూలి పనులు ప్రతి ఒక్కరికి నూతనంగా లభించడం జరుగుతుందన్నారు.కొలతల ప్రకారం పనిచేస్తే ఈ ఆర్థిక సంవత్సరం, కూలీలకు ఉపాధి వేతనం రూ.272 నుండి రూ.300 వరకు అనగా రూ.28 పెరగడం జరిగిందన్నారు. ఉపాధి కూలీలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని,ఎక్కువ సంఖ్యలో కూలీలు ఉపాధిహామీ కూలి పనులకు వెళ్లాలని కూలీలకు ఏపీఓ అవగాహన కల్పించారు.ప్రతి ఉపాది కూలి వంద రోజులు పని చేస్తే రోజుకు రూ.300 చొప్పున రూ.30,000 వెలు పొందవచ్చన్నారు ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సుమలత,మేట్స్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

6

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

హనుమకొండ

గురువారం | ఏప్రిల్ 4, 2024 | www.navatelangana.com

రైతులు గిట్టుబాటు ధరను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-రాయపర్తి



వరి ధాన్యానికి ప్రభుత్వం అందిస్తున్న గిట్టుబాటు ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో, మైలారం, సన్నూరు, మహబూబ్ నగర్ తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని పేర్కొన్నారు. క్వింటాకు కనీస మద్దతు ధర ఏ రకం రూ. 2,203, సాధారణ రకానికి రూ. 2,183 చెల్లించనున్నట్లు తెలిపారు. ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని శుభ్రం చేసి, ఎండబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేలా చూడాలన్నారు. ధాన్యం తూకం వేసిన తర్వాత రైతులు రశీదు తీసుకోవాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు టోకెన్ ప్రకారం కాంటాలు పెట్టాలని తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కిషన్, ఏపీఎం అశోక్, సిసిలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ ఘన్‌పూర్ కో-ఆర్డినేటర్‌గా వెంకట నరసింహారెడ్డి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ లోకసభ, అసెంబ్లీ కో-ఆర్డినేటర్‌గా జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పింగళి వెంకట నరసింహారెడ్డిని నియమించినట్లు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా పింగిలి వెంకట నరసింహారెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకంతో స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం బాధ్యతలు అప్పగించినందుకు సీఎం రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్, మంత్రులకు ఎమ్మెల్యేలకు కతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థి అదశ్యం

నవతెలంగాణ-చెన్నారావుపేట

మండల పరిధిలోని సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బోడ గణేష్ అనే విద్యార్థి సోమవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని చెన్నారావుపేట ఎస్సై గూడ అరుణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ విద్యార్థి 8 తరగతి చదువుతున్నాడని సోమవారం సాయంత్రం స్కూల్ నుండి 4:30 గంటల సమయంలో తప్పిపోయినట్లు తెలిపారు. విద్యార్థిది మండలం గూడూరు, గ్రామం కోబుల తండా తండ్రి బోడ వెంకన్న చేసిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

భర్తతో గొడవ మహిళ అదృశ్యం

నవతెలంగాణ-చెన్నారావుపేట

భర్తతో గొడవపడి భార్య అదశ్యమైనట్లు చెన్నారావుపేట ఎస్సై గూడ అరుణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గురజాల గ్రామానికి చెందిన బండారి పద్మ 58 సం, భర్త వెంకటేశ్వర్లుతో గొడవపడి మంగళవారం మధ్యాహ్నం ఇంట్లోంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. కుమారుడు గోపి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలో కాంగ్రెస్ పార్టీనీ మరింత బలోపేతం చేయడానికి కలిసికట్టుగా కృషి చేద్దామని కాంగ్రెస్ మండల అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో రెండోసారి శ్రీనివాస్ నాయక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, పిన్నింటి సునీల్‌రావు, గంగాధర్‌రావు, మాసాడి రాజేశ్వర్‌రావు, జిల్లా కుమార్, నక్క రాజు, రాప ర్తి రాణాప్రతాప్, సూరినేని విజయ్‌కుమార్, తిరుపతినాయక్, నక్క రాములు, సారయ్యా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చల్లా దంపతులకు బీఆర్ఎస్ నేత శుభాకాంక్షలు

నవతెలంగాణ-ఆత్మకూరు

పరకాల నియోజకవర్గంలోని ఆత్మకూరు మండల భారాస నాయకులు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి జ్యోతి దంపతులకు హనుమకొండలోని వారి నివాసంలో కలిసి పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి,పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు లేతాకుల సంజీవ రెడ్డి, నత్తి సుధాకర్,పెరుమాండ్ల బిక్షపతి, కలకోటి రాజేష్,నత్తి చిత్తరంజన్ తదితరులు పాల్గొన్నారు.

కడియం కావ్యకు శుభాకాంక్షలు

నవతెలంగాణ-పర్వతగిరి

కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య ను హనుమకొండలోని ఆమె స్వగహం లో బుధవారం మండలం లోని కొంకపాక గ్రామానికి చెందిన వరంగల్ అర్బన్ జిల్లా యువజన కార్యదర్శి బొక్కల ప్రమోద్ ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

లైబ్రరీలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి



- విద్యార్థుల భారీ ర్యాలీ, వీసీ బిల్డింగ్ ముందు ధర్నా

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

కాకతీయ యూనివర్సిటీలోని లైబ్రరీలో వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్‌యు, గిరిజన విద్యార్థి సంఘం, ఏబిఎస్ఎఫ్, బీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కేయూ లైబ్రరీ నుండి భారీ ర్యాలీ నిర్వహించి వీసీ బిల్డింగ్ ముందు గంటసేపు ధర్నా చేసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, గిరిజన విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రాజునాయక్, ఏబిఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జీ మంద నరేష్, బిఎస్ఎఫ్ కేయూ ఇన్చార్జి బొట్ల మనోహర్‌లు మాట్లాడుతూ కేయూ లైబ్రరీలో పేరుకు పోయిన సమస్యల వలన పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థుల చదువులకు ప్రధాన ఆటంకంగా మారుతున్నాయని యూనివర్సిటీ అధికారులు స్పందించి లైబ్రరీలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఉదయం 8 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు లైబ్రరీని కొనసాగించాలని, లైబ్రరీలో ఇంటర్నెట్, వైఫై సౌకర్యం కల్పించాలని, విద్యార్థులకు 200 కుర్చీలు ఫ్యాడ్స్‌తో పాటు ఫ్యాన్స్ ,లైట్స్ ఏర్పాటు చేయాలని, లైబ్రరీలో అన్నిపోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, మాస పత్రికలు ఏర్పాటు చేయాలని, రోజువారి న్యూస్ పేపర్లను క్రింది రూములోనే విద్యార్థులు చదువుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని యూనివర్సిటీ అధికారులను కోరారు.

అనంతరం విద్యార్థులను ఉద్దేశించి కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి మాట్లాడుతూ తక్షణమే విద్యార్థులకు మంచినీటి సౌకర్యం ట్యాంకర్ల ద్వారా కల్పిస్తామని, పది రోజుల్లో బోర్‌వేసి వాటర్ ప్లాంట్‌ను శాశ్వత ప్రతిపాదికన ఏర్పాటు చేస్తామని, లైబ్రరీలో నెలకొన్న సమస్యలన్నింటినీ ఒక్కొక్కటిగా శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి. మల్లారెడ్డి తో పాటు, ఎస్‌డిఎల్‌సి డైరెక్టర్ ఆచార్య వి.రామచంద్రం, కెయు ప్రిన్సిపాల్ బి.సురేష్‌లాల్ తదితరులు విద్యార్థులతో మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు రమేష్, కచర, మచ్చ పవన్ కళ్యాణ్, కుమార్ రాథోడ్, నరేందర్, కిరణ్, సాయి, శ్రావణ్, సోమేశ్, పథ్విరాజ్, ప్రసాద్, శశి, రమేష్, శ్రీకాంత్, ప్రశాంత్, ప్రియాంక, సురేఖ, సంధ్య, రాజశ్రీ, సానియా, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత భగీరథ యత్నం

నవతెలంగాణ-ఎల్కతుర్తి

అన్నదాత వేసిన పంటలను కాపాడుకోవడానికి భగీరథ యత్నం చేస్తున్నాడు. మండలంలో 19 గ్రామాలు, ఐదు అనుబంధ గ్రామాలు ఉన్నాయి. ఇందులో 24 750 ఎకరాల వ్యవసాయ శాఖ యోగ్యమైన భూమి ఉంది. గత వర్షాకాలంలో వేసిన వరి, పత్తి సరిగా పండగ నష్టపోయిన రైతన్న, రబి సీజన్లో (వేసంగి) నన్న మంచి పంటలు పండుతాయి అని ఆశపడి, బోర్లు బావుల కింద మొక్కజొన్న, వరి, మిర్చి పంటలు వేసుకున్నారు. కానీ ఈ సంవత్సరం వర్షాకాలం 52 శాతం లోటు తో ఉంది. గత సెప్టెంబర్ నుండి ఒక్క వర్షం కూడా లేక వేసిన పంటలు చివరి దశలో ఎండిపోతున్నాయి. తడిసిన మడే మళ్లీ మళ్లీ తడుస్తోంది. ఈ క్రమంలో లక్ష రూపాయలు వెచ్చించి బావులలో పూడిక తీపిస్తున్నారు. అయినప్పటికీ ఫలితం మాత్రం అంతంత మాత్రమే, ఇదివరకు ధర్మసాగర్ మండలం దేవాదుల రిజర్వాయర్ నుండి, డిసెంబర్ మాసంలోనే ఉపకాల్వ ద్వారా చెరువులను నింపేవారు.



కానీ ఈ సంవత్సరం దేవాదుల నుండి ఒకటి రెండు రోజులు మాత్రమేనీరు వదిలి అధికారులు పట్టించుకోవడం మానేశారు. దానివల్ల చెరువుల్లో పూర్తిగా నీరు అడుగంటిపోయి బావుల్లో, బోర్లలో నీళ్లు సరిగా రావడం లేదు. బావుల్లో పూడిక తీయడానికి ఒక కోలా, (6 ఫీట్లు) లక్ష రూపాయలు ధర నిర్ణయించుకుని పూడిక తీస్తున్నారు. పాలమూరు, మహబూబ్నగర్ జిల్లా నుండి ఇప్పటి వరకు సుమారు 200 కుటుంబాలు పూడిక తీయడానికే వచ్చారు. అయినప్పటికీ ఫలితం అంతంత మాత్రమే.





పురాణాలలో అపర భగీరథుడు గంగను దించడానికి ఎన్ని ప్రయత్నాలు చేసాడో, అంతకు రెట్టింపు రైతన్న కష్టపడినా ఫలితం మాత్రం శూన్యం. ఇప్పటికైనా పాలకులు ముందస్తు చర్యగా ఈసారైనా చెరువులు నింపితే రైతన్నకు ఖరీఫ్ సీజన్లో సరియైన పంటలు పడతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన వీరగాని శ్రీనివాస్ ఉమా దంపతుల కుమార్తె వైష్ణవి వివాహ వేడుక బుధవారం జరిగింది. ఈ వివాహ వేడుకకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

ఎమ్మెల్యే వెంట పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ పోలేపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు దుబాసి కృష్ణ మూర్తి, మారపల్లి రవీందర్, డిటి రెడ్డి, గట్టు సుమన్, మాదారపు సు దర్శన్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరామర్శ

నవతెలంగాణ-వరంగల్



వర్ధన్నపేట మండలంలోని నల్లబెల్లి గ్రామంలోఅనారోగ్య కారణాలతో మృతిచెందిన బిర్రు ఉప్పలయ్య కుటుంబ సభ్యులు నందనం సొసైటీ డైరెక్టర్ పద్మకుమారస్వామి, ప్రొఫెసర్ డాక్టర్ బిరు దేవేందర్, డాక్టర్ రామన్న, బాబులను బుధవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్.నాగరాజ్ పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ముందుగా ఉప్పలయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంటా మాజీ జెడ్పిటిసి కమ్మగాని ప్రభాకర్ గౌడ్, మాజీ సర్పంచ్ తాటికాయల ఆనందం, పార్టీ అధ్యక్షుడు తాటికాయల దిలీప్, బిర్రు భాస్కర్, ప్రశాంత్, ప్రవీణ్, యాకయ్య, జక్కి గోపాల్, బిర్రు యాకయ్య బిర్రు బురికి గోపాల్ గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.